
# ఆర్థిక స్థితి పెంచుకోవాలంటే

తటవర్తి వీరరాఘవరావు



బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో....

# ఆర్థికస్థితి పెంచుకోవాలంటే ?



రచన & ప్రచురణ : తటవర్తి వీరరాఘవరావు


ప్రథమ ముద్రణ : అక్టోబరు, 2023
కాపీలు : 2,000

వెల : రూ. 50/-



పుస్తకముల కొరకు

**తటవర్తి వీర రాఘవరావు**

తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.
సెల్ : 9440309812
email : balajipyramid.bvrm@gmail.com

# విషయ సూచిక


**ఆర్థికస్థితి పెంచుకోవాలంటే?** **3**

**1.ఆర్థిక సమస్యలకు కారణం?** **4**

- ఆర్థికంగా దెబ్బతినడం 5
- ఆర్థికంగా ఎదగలేకపోవడం:- 7

**2.ఆర్థిక స్థితి సరిగా లేకపోవడం** **10**

- అర్హత లేకపోవడం 10
- అర్హత లేకపోవడానికి కారణాలు 10
- అర్హత అన్నది ఎలా వస్తుంది? 11
- పేదవారి జీవిత అనుభవాలు పొందడం కోసం అలాంటి జన్మ తీసుకుంటారు. 12
- ఆధ్యాత్మిక ఎదుగుదలకు ధనం అవసరం లేదు. పైగా ధనమన్నది పెద్ద అవరోధం అవుతుంది. 15

**3.ఆర్థిక స్థితి పెంచుకోవాలంటే?** **18**

**4.ఈ జన్మలోనే ఆర్థిక స్థితి పెంచుకోవాలంటే?** **28**

- చేసుకోవాలి 28
- మీ భవిష్యత్తును తనఖా పెట్టాలి 32
- ఎవరైనా సహాయం చెయ్యాలి 32

**5. అత్యంత ధనవంతులు కావాలంటే?** **38**

# ఆర్థికస్థితి పెంచుకోవాలంటే?

లోకంలో ఆర్థికస్థితి సరిగ్గా లేదని బాధపడే వాళ్ళు ఎంతోమంది ఉన్నారు. ఎవరిని చూసినా ఆర్థిక స్థితి పెంచుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నారు, తప్పులు చేస్తున్నారు, పాపాలు చేస్తున్నారు, అధర్మంగా వ్యవహరిస్తున్నారు. డబ్బు సంపాదించాలనే ఆశలో పడి లక్షలు కాదు కోట్లు కోల్పోయినవారు ఉన్నారు. మన సొసైటీలో కూడా బిట్ కాయిన్స్ లో డబ్బు పెట్టి లక్షలు, లక్షలు కోల్పోయిన వారున్నారు.

అంతేకాదు లోకంలో డబ్బు లేదని బాధపడేవారు, డబ్బు సంపాదించాలని ప్రయత్నం చేసేవారు, సంపాదించలేక పోయానని బాధపడే వారు, డబ్బు ఉన్నవాళ్లను చూసి అసూయపడేవారు ఇలా రకరకాలుగా ఉన్నారు. ఏమీ చేయలేక నిరాశగా ఉన్నవారు ఉన్నారు, దేవుణ్ణి నిందించేవారు కూడా ఉన్నారు.

అందుచేత ఆర్థిక విషయాల మీద అవగాహన చేసుకుందాం.

1. ఆర్థిక సమస్యలకు కారణం,

2. ఆర్థిక స్థితి సరిగా లేకపోవడానికి కారణం,

3. ఆర్థిక స్థితి పెంచుకోవాలంటే ఏం చేయాలి?

4. ఈ జన్మలోనే ఆర్థిక స్థితి పెంచుకోవాలంటే ఏం చేయాలి అన్న వాటి గురించి తెలుసుకుందాం.

# 1.ఆర్థిక సమస్యలకు కారణం?

మానవునకు ఎన్ని ఉన్నా తృప్తి లేకపోవడం వల్ల, కోర రానిది కోరడమే కాదు, ఇంకా ఇంకా అని ఆశ పడడం వల్ల, ఈ ఆశ పడే మనసును తృప్తిపరచడానికి, దానితోపాటు మనసు కోరిన కోరికలు తీర్చడానికి, ముఖ్యంగా ధనం అవసరం. అందుచేత ఆ ధనం సంపాదించడం కోసం ప్రతి ఒక్కరూ చేయకూడని పనులు చేస్తున్నారు, మోసాలు చేస్తున్నారు, అబద్ధాలు చెబుతున్నారు, అధర్మ మైన మార్గాలు అనుసరిస్తున్నారు, అన్యాయంగా, అక్రమంగా సంపాదిస్తూ సృష్టికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. దాని ఫలితంగా ఆర్థిక సమస్యలలో చిక్కుకుంటున్నారు. నేను ఆర్థిక సమస్యలతో సతమత అవుతున్నాను అని వాపోతున్నారు.

పైగా న్యాయంగా ఉంటే ఇప్పుడు ఎవరు సంపాదించగలరు? అని చేసిన పనిని సమర్ధించు కుంటున్నారు. అసలు ధర్మంగా ఉంటే ప్రస్తుత కాలంలో జీవించగలమా? అని కూడా ప్రశ్నిస్తారు. కానీ అంతకన్నా ఆలోచించడం లేదు.

తెలుసుకోండి ఎవరైనా సరే, వారు గతంలో చేసుకొని సంపాదించుకున్న అర్హతను బట్టే వారి ప్రస్తుత ఆర్థిక స్థితి ఆధారపడి ఉంది. అందుచేత ఎవరైనా సరే, వారికి ఇవ్వబడిన ఆర్థిక స్థితితో తృప్తిపడి, అవసరాలకు పరిమితమై, అనవసరమైన కోరికలకు బానిస కాకుండా, సృష్టికి, సృష్టి ధర్మానికి అనుగుణంగా సంపాదిస్తే, ఎవరికీ ఆర్థిక సమస్యలు రావు. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నానని బాధపడవలసిన అవసరం కూడా రాదు. అందుచేత తెలుసుకోండి, ఎవరైనా సరే అత్యాశతో, ఇంకా ఇంకా అంటూ అడ్డమార్గాల ద్వారా సంపాదించడానికి చేసే ప్రయత్నమే ఆర్థిక అనర్థాలకు కు కారణం. అందుచేత తెలుసుకోండి ఆర్థిక సమస్యలకు కారణం కోరికలు, అత్యాశ. ఇవి మనసుకు సంబంధించినవి. అందుచేత మనసును అదుపు చేసుకుంటే, కోరికలు అదుపులో ఉంటాయి. మనస్సును శుద్ధి చేసుకుంటే, అత్యాశ పోతుంది. ఈ రెండు సాధించాలంటే తప్పనిసరిగా ధ్యానం చేయాలి. ధ్యానం చేస్తే మెల్లిగా చెయ్యకూడదని పనులు చెయ్యరు, అధర్మంగా, సృష్టికి విరుద్ధంగా ప్రవర్తించరు.

అప్పుడు మీకు ఆర్థిక సమస్యలు రావు.

తెలుసుకోండి ఈ సృష్టిలో ఎవరి అర్హతను బట్టి వారికి ఆర్థిక స్థితి ఇవ్వబడింది. అందుకే ఒకడు పుట్టుకతోనే కోటేశ్వరుడు అవుతాడు, ఇంకొకడు లక్షాధికారి అవుతాడు, మరొకడు బిక్షాధికారి. కారణం గతంలో వారు సంపాదించుకున్న అర్హతే. అందుచేత అర్హతకు మించి ఆశిస్తూ, సృష్టి విరుద్ధంగా ప్రయత్నిస్తే, అనర్థాలు, ఆర్థిక ఇబ్బందులు కలుగుతాయి. అందుచేత సంపాదించడానికి అతిగా కష్ట పడవలసిన పని లేదు. మీరు అతిగా కష్టపడినా, మామూలుగా కృషిచేసినా, ఉండవలసింది ఉంటుంది, రావాల్సింది వచ్చి తీరుతుంది, పోవాల్సింది పోతుంది కూడా.

అందుచేత ఎవరైనా సరే ఆర్థిక ఇబ్బందులు ఉండకూడదు అనుకుంటే ధర్మంగా సంపాదించే ప్రయత్నం చేయాలి. అలాగే ఆర్థిక స్థితి పెరగాలి అంటే కనీసం ఇక్కడ నుంచైనా అర్హత పెంచుకునే ప్రయత్నం చేయాలి. అర్హత అన్నది ఇస్తే వస్తుంది. ఏది ఇస్తే అదే ఈ సృష్టిలో వస్తుంది, ఎంత ఇస్తే అంతే వస్తుంది.

మరి ధనం పెరగాలనుకొనే వారు ధనాన్ని ఇవ్వడానికి ప్రయత్నించాలి, లోకకళ్యాణ కరమైన పనులు చేయటానికి ధనాన్ని వినియోగించాలి. మరి ఆ స్థితి రావాలంటే! ఎవరైనా బాగా ధ్యానం చేయాలి. ధ్యానం ద్వారా సాత్విక గుణంలోకి వస్తే, వారికి ఎవ్వరూ చెప్పనవసరం లేకుండా ఇవ్వడానికి ప్రయత్నిస్తారు. ఆటోమేటిక్ గా వారు భవిష్యత్తులో ధనవంతులు అవుతారు. అంతేకాదు అధర్మ మైన పనులు చేయకపోవడం వల్ల, ఆర్థిక ఇబ్బందులు కూడా రావు.

అంతే కాదు ఈ ఆర్థిక సమస్యలు రెండు రకాలుగా వుంటాయి.

1. ఆర్థికంగా దెబ్బతినడం.
2. ఆర్థికంగా ఎదగలేకపోవడం.

**1. ఆర్థికంగా దెబ్బతినడం:-**

కొంతమంది కొన్నాళ్ళు ఆర్థికంగా బాగానే వుంటారు. తరువాత ఎందుకో తెలియదు. ఆర్థికంగా దెబ్బతిని వాళ్ళకు ఉన్నవన్నీ అమ్ముకుంటారు, అప్పుల పాలవుతారు.

ఉదాహరణకు రిలయన్స్ ముఖేష్ అంబానీ బ్రదర్ అనిల్ అంబానీని చూస్తే మనకు తెలుస్తుంది. అనిల్ అంబానీ అప్పుల పాలయ్యాడు. ఒకప్పుడు

గొప్పగానే ఉండేవాడు ఇప్పుడు చూస్తే చాలా దారుణమైన పరిస్థితిలో ఉన్నాడు. లోకంలో ఇలాంటి వారు చాలా మంది ఉన్నారు. ఇదంతా గతంలో చేసుకున్న కర్మల వల్లనే జరిగిందని తెలుసుకోవాలి.

అందుచేత ఆర్థికస్థితి దెబ్బతింది అంటే ఖచ్చితంగా ఇంతకు ముందు అంటే గతంలో కానీ, గత జన్మల్లో కానీ వారు చేసిన మోసాలు, అధర్మ సంపాదన, ఇతరుల ధనాన్ని అపహరించడం, దోచుకోవడం, దౌర్జన్యంగా సంపాదించడం అంటే రౌడీయిజం లాంటివి చేసి సంపాదించడం వల్ల, వాటి ఫలితం ప్రస్తుతం అనుభవిస్తున్నారని తెలుసుకోవాలి.

ప్రస్తుతం ఆ విషయం వారికి తెలియకపోవచ్చు. కానీ ఎవరైనా సరే ఇంతకు ముందు చేసింది అనుభవించ వలసిందే. ఈ విషయం తెలియకే చాలా మంది అధర్మ మార్గాల ద్వారా డబ్బు సంపాదిస్తున్నారు, సృష్టి విరుద్ధమైన పనులు చేసి ధనవంతులు కావాలని చూస్తున్నారు. కానీ సృష్టినే నడిపిస్తున్న భగవంతుడు ఏర్పాటు చేసిన నియమాలను, ధర్మాలను పాటించడం లేదు. అందుచేత సృష్టివిరుద్ధంగా ప్రయత్నించిన వారు దానికి తగ్గ ఫలితం అనుభవించవలసిందే! అనుభవిస్తున్నారు కూడా.

చూడండి మన సోసైటీలో కొంతమంది మాస్టర్లు ఏమంటారంటే ? మనీ మెడిటేషన్ చేస్తే డబ్బు వస్తుందంటారు. ఆలోచించండి కర్మలు చేసిన వారికి మనీ మెడిటేషన్ చేస్తే డబ్బు వస్తుందా? ఎలా వస్తుంది? అలాగే కొంతమంది కర్మ విపాక ధ్యానాలు చేయిస్తారు. కానీ కళ్ళు మూసుకుని కర్మలు పోతాయి, పోతాయి అని అనుకుంటే పోతాయా? ఎలా పోతాయి? శ్రీ కృష్ణుల వారు స్పష్టంగా చెప్పారు కదా!

**శ్లో॥ యథైధాంసి సమిద్ధోఽగ్నిర్భస్మసాత్కురుతేఽర్జున।**
**జ్ఞానాగ్నిస్సర్వకర్మాణి భస్మసాత్కురుతే తథా ॥ (భ.గీ.4-37)**

తా:- అర్జునా! బాగుగా ప్రజ్వలింప చేయబడిన అగ్ని కట్టెలను ఏ ప్రకారంగా బూడిదగా చేస్తుందో, ఆ ప్రకారంగా జ్ఞానాగ్ని సమస్త కర్మలను భస్మం చేస్తుంది.

దీనిని బట్టి శ్రీ కృష్ణుల వారు జ్ఞానమనే అగ్నిలోనే కర్మలు దగ్ధమవుతాయని స్పష్టంగా చెప్పారు. అందుచేత తెలుసుకోండి జ్ఞానం సంపాదించుకోకుండా ఊరికే కూర్చుని కర్మ పోయింది, కర్మ పోయింది అని

అనుకుంటే పోతుందా? వూరికే మిమ్మల్ని ఆకర్షించడానికి, అలా మభ్య పెడతారు తప్ప అలాంటి ధ్యానాల వల్ల ఏమీ ప్రయోజనం లేదు. మీకు నిజంగా కర్మలు పోవాలంటే? జ్ఞానం సంపాదించుకోండి. జ్ఞానం ఎలా సంపాదించుకోవాలో పత్రిగారు చెప్పారు కదా? నేను, మా మేడం కూడా చెపుతూనే వున్నాం కదా? అందుచేత ఆ పనులు చేయండి.

ఒకవేళ జ్ఞానం పొందలేకపోతే కర్మలు అనుభవించవలసిందే! అందుచేత అలాంటి ధ్యానాల వల్ల ఏమి ప్రయోజనం లేదు, ఫలితం ఉండదని తెలుసుకోండి.

మరి అలాంటి ఆర్థిక సమస్యల్లో వున్న వారు ఏమి చెయ్యాలి? అంటే సృష్టి నియమాలకు అనుగుణంగా ప్రయత్నించాలి. అప్పుడు మీ భవిష్యత్తు మారుతుంది. ప్రస్తుతం మీ ఆర్థిక స్థితిబాగోక పోయినా కనీసం భవిష్యత్తులో అయినా మారుతుంది.

అందుచేత ఎవరికైనా గతంలో చేసిన కర్మలను బట్టి రావల్సింది వస్తుంది, పోవల్సింది పోతుంది. అందుచేత ఏమి చేయకుండా ఏడుస్తూ కూర్చుంటే ఏమి రాదు. కనీసం ఇప్పుడైనా సృష్టికి అనుగుణంగా ప్రయత్నించి మీ భవిష్యత్తు మార్చుకోండి.

చూడండి కొంతమంది తమ దగ్గిర వారే డబ్బు ఎగ్గొట్టారు, మమ్మల్ని మోసం చేశారు అంటారు, దానికి కారణం ఇంతకుముందు జన్మల్లో వీళ్ళు ఎవ్వరినో మోసం చేశారు, దాని ఫలితంగా ఇప్పుడు మోసపోయారు అంతే.

కొంత మంది చిట్ ఫండ్స్ కంపెనీ వాడు ఎగ్గొట్టాడు అంటారు, కొంతమంది ఫైనాన్స్ కంపెనీ వాడు ఎగ్గొట్టాడంటారు. కాని అంతకుముందు జన్మల్లో వీరు ఎవ్వరికో దెబ్బ వేయడం కాని, ఎగ్గొట్టడం కాని చేయబట్టే ఇప్పుడు వీరికి దెబ్బ పడింది.

అందుచేత తెలుసుకోండి పరమాత్మ నియమాల నుంచి ఎవరూ తప్పించుకోలేరు. అంతేకాదు “దెబ్బ వేయడం తెలికే! కాని దెబ్బ పడితేనే భరించడం కష్టం” అని తెలుసుకోవాలి.

**2. ఆర్థికంగా ఎదగలేకపోవడం:-**

చాలా మంది ఆర్థికస్థితి బాగా లేకపోతే పెంచుకోవడానికి ప్రయత్నిస్తారు. రాత్రి, పగలు కూడా ఓవరటైంలు చేసి కష్టపడతారు. కాని

ఎంత కష్టపడినా ఆర్థికస్థితి పెరగదు. కాని కొంతమందికి ఏమీ కష్టపడకండానే ఆర్థిక స్థితి పెరుగుతుంది. అందుచేత ముందు వీటికి కారణం తెలుసుకుందాం, తరువాత పరిష్కారం కూడా తెలుసుకుందాం.

ముందు మనం ఒక విషయం తెలుసుకోవాలి. ఈ సృష్టిలో ఉన్న మనం ఆ సృష్టికర్త చేత సృష్టింపబడ్డాము. ఇక్కడ మనము అంటే మానవులమే కాదు, 84లక్షల రకాల జీవరాసులు కూడా సృష్టింపబడ్డాయి. ఇవన్నీ కూడా ఆ సృష్టికర్త అంటే ఆ పరబ్రహ్మ ఏర్పాటుచేసిన సిద్ధాంతాలు, నియమాలు అంటే ధర్మాలను అనుసరించే నడుచుకోవాలి. వాటికి విరుద్ధంగా ప్రవర్తిస్తే శిక్షలు పడతాయి అంటే కష్టాలు, సమస్యలు వస్తాయి.

అందులో ఒక ముఖ్యమైన సిద్ధాంతం “కర్మ సిద్ధాంతం”. కర్మ సిద్ధాంతం అంటే **“నువ్వు ఏదైతే గతంలో చేసుకుంటావో దాని ఫలితం ఇప్పుడు అనుభవిస్తావు. అలాగే ఇప్పుడు చేసుకొనేది భవిష్యత్తులో అనుభవిస్తావు”.** ఈ విషయం బాగా గుర్తు పెట్టుకోవాలి, మరచిపోకూడదు.

మరి ఈ ఆర్థిక సమస్యలు, ప్రస్తుత ఆర్థిక స్థితులు గతంలో మీరు చేసిన కర్మలను బట్టే ఆధారపడి ఉన్నాయని తెలుసుకోవాలి. అలాగే భవిష్యత్తులో మీ ఆర్థిక స్థితి దేనిని బట్టి ఉంటుందంటే?ఇప్పుడు మీరు చేసే కర్మలను బట్టి ఆధారపడి వుంటుంది. అలాగే ఆర్థికంగా దెబ్బతినడం, ఆర్థికంగా ఎదగలేకపోవడం కూడా కర్మ సిద్ధాంతాన్ని అనుసరించే ఉంటుంది.

అంటే గతంలో చేసుకొన్న దాన్ని బట్టే ఆర్థికస్థితి ఉంటుంది. నువ్వు గతంలో ముందు పుణ్యాలు చేశావు, అంటే దానాలు, సేవలు చేశావు తరువాత మోసాలు చేశావు, ఎవరికో డబ్బులు ఎగ్గొట్టావు, ఏమవుతుంది? ప్రారంభంలో పుణ్యాలు చేయడం వల్ల ఆర్థికస్థితి బాగుంటుంది, తరువాత చేసిన పాపాల వల్ల ఆర్థిక స్థితి దెబ్బతింటుంది. అప్పుడు అనుకుంటావు ఏమిటో నా పరిస్థితి ఇలా అయిపోయింది, దేవుడు నాకు అన్యాయం చేశాడు అని బాధపడతారు. కాని ఎంత బాధపడినా లాభం లేదు, చేసింది అనుభవించవలసిందే!

ఎందుచేతనంటే? మన సొసైటీలో మనీ మెడిటేషన్ అంటే ఎగ బడటానికి ముఖ్య కారణం ఆర్థిక సమస్యలు, వాటితో పాటు ఆర్థిక స్థితి సరిగా లేకపోవడం. అందుచేత వారు ముందు వెనుక ఆలోచించరు. ఇలాంటి వారిని కొంతమంది క్యాష్ చేసుకుంటున్నారు కూడా!

ఇంకా చాలా మంది ఆర్థిక స్థితి పెంచుకోవడానికి మొక్కులు మొక్కుతారు, గురువులను ఆశ్రయిస్తారు, ప్రార్థనా కూటాలలో పాల్గొంటారు. కొంతమంది ధనలక్ష్మి యంత్రాలు, కుబేర యంత్రాలు ధరిస్తూ వుంటారు. ఇంకా కొంతమంది వాస్తు కూడా సరి చేయించుకుంటారు, జాతకాలు కూడా చూపించుకుంటూ ఉంటారు. అలా ధనం పెంచుకోవడానికి ఎన్నో తిప్పలు పడుతున్నారు. కానీ ఆర్థిక స్థితి పెంచుకోవాలనకునేవారు ముఖ్యంగా ఈ విషయాల మీద అవగాహన ఉండాలి.

1. నేను ఈ సృష్టిలో ఉన్నాను.

2. ఈ సృష్టిని సృష్టి చేసిన సృష్టికర్త ఉన్నాడు.

3. ఆ సృష్టికర్త ఏర్పాటు చేసిన నియమాలు అంటే ధర్మాలు, సిద్ధాంతాలు కూడా వున్నాయని మర్చిపోకూడదు.

ముఖ్యంగా ఈ సృష్టిలో నేను ఉన్నాను, సృష్టి నియమాలు అంటే ధర్మాలు ఉన్నాయి అన్న విషయం మర్చిపోకూడదు.

ఎందుచేతనంటే మీరు ఏది పొందాలన్నా, ఏది సంపాదించాలన్న సృష్టి నియమాలను అనుసరించే ప్రయత్నించాలి. అంతేకాని మీరు అనుకున్నట్టు ప్రయత్నించినా..కష్టపడినా ప్రయోజనంలేదు. ఏ గురువు, ఏ పీఠాధిపతి ఏమీ చేయలేరు, వారి కాళ్ళ మీద పడినా ఏమీ ఉపయోగం లేదు.

గురువులను మనం ఆశ్రయించేది, వారికి సేవ చేసేది వారినుంచి సరైన మార్గం తెలుసుకోవడానికే! అంతేకానీ వారు మనకి ధనం ఇవ్వలేరు, మనల్ని ధనవంతులు చేయలేరు.

# 2.ఆర్థిక స్థితి సరిగా లేకపోవడం

దీనికి ముఖ్యంగా మూడు కారణాలు చెప్పుకోవచ్చు.

1) అర్హత లేకపోవడం

2) పేదవాడి అనుభవాలు పొందడం కోసం అలాంటి జన్మ ఎంచుకోవడం

3) ఆధ్యాత్మికంగా ఎదగడానికి డబ్బు అవసరం లేదు. అందుకే ధనం ఎంచుకోరు, యోగుల కుటుంబాన్ని ఎంచుకుంటారు.

**1) అర్హత లేకపోవడం :-**

"అర్హత లేకపోవడం" అంటే భూమి మీదకు వచ్చారు కానీ అర్హత సంపాదించు కోకుండా వచ్చారు. ఏ అర్హత? అంటే ఆర్థిక స్థితి పొందే అర్హత. అందుచేత ఎవరికైనా ధనం ఉంది అంటే వారికి అర్హత ఉందని, ధనం లేదు అంటే అర్హత లేదు అని తెలుసుకోవాలి.

అందుచేత అర్హత లేకుండా ఏమి చేసినా, ఎంత కష్టపడినా, ఓవర్ టైమ్‌లు చేసినా ధనం పెరగదు. పందాలు కాసినా, బిట్ కాయిన్స్ లో పెట్టినా రాదు. మోసాలు చేసినా, దొంగతనాలు చేసినా ధనం పెరగదు. అందుచేత మీ తెలివితేటలు అర్హత సంపాదించడానికి ఉపయోగించండి.

మరి అర్హత లేకపోవడానికి కారణాలు ఏమిటి? అర్హత అన్నది ఎలా వస్తుందో తెలుసుకుందాం.

**అర్హత లేకపోవడానికి కారణాలు:-**

1. గతజన్మలో చేసిన మోసాలు, అధర్మ సంపాదన అంటే ఇతరుల ధనాన్ని అపహరించడం, అమాయకులను అధికారం- బలం చూపించి దోచుకోవడం. 2. గతంలో ఎంత ధనం ఉన్నా పంచకపోవడం. 3. గతంలో ఎవరికి ఏదీ ఇవ్వకపోవడం. 4. గతంలో ధన దానాలు చేసి ఉండకపోవడం.

ఇవన్నీ అర్హత లేకపోవడానికి కారణాలు.

ఇలాంటి పనులు చేసి ఇప్పుడు ఏడిస్తే డబ్బు వస్తుందా? తెలిసో తెలియకో ఇదివరకు అలా జీవించారు. మరి అలాంటి వారు ఇప్పుడు ఏం చేయాలి? అంటే కనీసం ఇప్పటినుంచైనా ఎవరిని మోసగించకండి, ఎవరికి అన్యాయం చేయకండి, అధర్మంగా సంపాదించకండి.

20 సంవత్సరాల క్రితం అంటే పత్రీజీ పరిచయం కాకముందు నాకు ఈ విషయాలు తెలియవు. అప్పుడు ఎంత ధనం సంపాదిస్తే అంత గౌరవం,

అంత విలువ అనే అభిప్రాయం ఉండేది. అందుకే రాత్రి పగలు కష్టపడి సంపాదించే వాడిని. ఎంతసేపూ ఎంత సంపాదిస్తున్నాను అని చూసేవాడిని కాని, ఎలా సంపాదిస్తున్నాను అన్నది చూడలేదు. నాది రైస్ మిల్లు వ్యాపారం, పెద్ద వ్యాపారం చేసే వారిలో నేనూ ఒకడిని.

పత్రీజీ పరిచయం అయ్యాక ఆలోచించాను! అసలు నేను ధనం సంపాదిస్తున్నానా? పాపం సంపాదిస్తున్నానా? అనిచూస్తే పాపమే సంపాదిస్తున్నాను కాని ధనం కాదు అని అర్థమైంది. అందుచేత నేను వ్యాపారం మానేసి ధ్యాన మార్గలోకి రావడం జరిగింది.

మీకు మూడవ కన్ను ఉంటే? ఆ మూడవకన్నుతో చూడగలిగితే ఇప్పుడు అడుక్కునే వారిలోకాని, పేదవారిలోకాని ఎక్కువమంది గతజన్మలలో ధనవంతులే. కారణం ధనం ఉన్నప్పుడు సవ్యంగా ఖర్చు పెట్టలేదు, దానాలు చెయ్యలేదు, అవసరానికి మించి వున్న ధనాన్ని సరదాలకు, విలాసాలకు, భోగాలకు, గొప్పల కోసం, ఆర్భాటాలకు ఖర్చు చేశారు. ఇవ్వబడిన ధనాన్ని పూర్తిగా వ్యర్థం చేయడమే కాదు, దుర్వినియోగం కూడా చేశారు. దాని ఫలితంగా ఇప్పుడు పేదవారిలా అనుభవిస్తున్నారు.

అందుచేత ఇప్పటినుంచైనా ధర్మంగా సంపాదించడం నేర్చుకోండి. మజ్జిగ మెతుకులు తినైనా బ్రతకాలి కాని, అధర్మంగా సంపాదించకూడదు. వుంటే అనుభవించండి, లేకపోతే ఉన్నదానితో తృప్తిగా జీవించండి. ఇతరులతో పోల్చుకోకండి. మీకున్న స్థితి ఈ జన్మ వరకే అని తెలుసుకోండి. సరిగ్గా జీవిస్తే మరల మీ భవిష్యత్తు కూడా మారిపోతుంది. అందుచేత ఇతరులది ఆశించకండి, ఉన్నది దాచుకోకండి, ఎవరిదీ అపహరించకండి.

**అర్హత అన్నది ఎలా వస్తుంది? :-**

అర్హత అన్నది ఇస్తే వస్తుంది. ఏది ఇస్తే అదే వస్తుంది, ఎంత ఇస్తే అంతే వస్తుంది. అందుచేత ధనం కావాలనుకున్నవారు ధనాన్ని ఇవ్వాల్సిందే.

అందుకే పత్రీజీ ఏమన్నారంటే? **"పంచింది పెంచబడుతుంది, దాచుకున్నది దోచుకోబడుతుంది"** అన్నారు.

అందుచేత నువ్వు ధనాన్ని పెంచుకోవాలని అనుకుంటే? ధనాన్ని పంచవలసిందే! ధనం పంచకుండా దాచుకుంటే చివరికి ప్రకృతిచే దోచుకో బడుతుంది అంటే ఏదోరకంగా కోల్పోవలసి వస్తుంది. ఇదే ప్రకృతిలో ఉన్న ఏర్పాటు. అందుకే పత్రీజీ లోక కళ్యాణ కరమైన పనులు చేయిస్తూ వుంటారు.

ఆత్మ సేవలకు ధనాన్ని ఖర్చు పెట్టమంటారు.

శ్రీ విద్యా ప్రకాశానంద గిరి స్వామి వారు ఏమన్నారంటే? "నీవు దాచుకున్నది జారిపోతుంది, ఇతరులకు ఇచ్చింది నీ ఖాతాలో జమ అవుతుందని తెలుసుకో" అన్నారు. ఆయన ఇంకా "నీవు తిన్నది మట్టిపాలు, ఇతరులకు ఇచ్చింది నీ పాలని తెలుసుకో!" అన్నారు.

అందుకే **"చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవ"** అని శాస్త్రాలలో చెప్పబడింది.

అందుచేత ఏదిచేస్తే అదే వస్తుందని తెలుసుకోండి. ధన దానాలు చేస్తే ధనమే వస్తుంది. మీరు ఏమీ ఇవ్వకపోతే ఎక్కడి నుంచి వస్తుంది? రాదు కదా? సహజంగా చాలామంది డబ్బు ఇవ్వలేరు. కాని సృష్టిలో ఇవ్వగలిగిన వారే గొప్పవారు. ఎందుచేతనంటే? ఇవ్వడం కష్టం, పుచ్చుకోవడం ఇష్టం. కానీ కష్టమైనా ఇస్తేనే ధనం వస్తుంది. ఉన్న దాంట్లో కొంత ఇవ్వండి. మీరేమీ కోట్లు ఇవ్వక్కర్లేదు.

అందుచేత రూ.100 ఉంటే ఒక్క రూపాయి ఇవ్వండి. ఈ సృష్టిలో కోట్లు ఇవ్వడం కాదు మీకున్న దాంట్లో ఎంత ఇచ్చావు అన్నదే ముఖ్యం. ఒకడు కోటి ఉంటే లక్ష ఇచ్చాడు అంటే 1% ఇచ్చాడు. ఇంకొకడు 1000 ఉంటే 100 ఇచ్చాడు, అంటే 10% ఇచ్చాడు.

అందుచేత సృష్టి లెక్కలో అంటే భగవంతుని లెక్కలో 100 ఇచ్చినవాడు గొప్పవాడు. కాని సామాన్యంగా లోకంలో లక్ష ఇచ్చిన వాడిని గొప్పవాడిగా భావిస్తారు.

కాని 100 ఇచ్చినవాడు భవిష్యత్తులో కోటీశ్వరుడు అవుతాడు, లక్ష ఇచ్చినవాడు సామాన్యుడు అవుతాడు. అందుచేత ఉన్నదంతా ఇవ్వనక్కర్లేదు ఉన్నదాంట్లో ఎంత యివ్వగలిగితే అంతే ఇవ్వండి. ధనాన్ని పొందే అర్హత సంపాదించుకోండి.

**2. పేదవారి జీవిత అనుభవాలు పొందడం కోసం అలాంటి జన్మ తీసుకుంటారు:**

ఆర్థిక స్థితి సరిగా లేని వాళ్ళు కొంతమంది అలాంటి జన్మ ఎంచుకొని వస్తారు.

సహజంగా బాగా డబ్బు ఉన్నవాళ్ళలో గర్వం, అహంకారం ఎక్కువగా ఉంటుంది. చూడండి జమీందార్లు, రాజులు, ధనవంతుల్లో ధనగర్వం బాగా ఉంటుంది. ఆ ధన గర్వంతో, ధన మదంతో ధనం లేని వారిని కించపరుస్తారు,

తక్కువగా చూస్తారు, అవమానిస్తారు, వాళ్ళను పనికిరాని వాళ్ళగా చూస్తారు.

కానీ అందరూ ఒక్కటే! అందరూ ఆత్మలే అని తెలుసుకోవాలి. మరి అందరూ ఆత్మలు అయినప్పుడు అందరూ ఒక్కటే కదా? అందరూ సమానమే కదా?

అందుకే అన్నమాచార్యుల వారు **"బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే"** అని పాడుతూ **"హీనాధికములెందు లేవు"**.. **"అందరికీ శ్రీహరే అంతరాత్మ"** అన్నారు.

దాని అర్థం ఈ సృష్టిలో హీనమైన వాడు, అధికమైనవాడు ఎవరూ లేరు, కారణం అందరికీ ఆ శ్రీహరే అంతరాత్మ కాబట్టి. అందుచేత అందరూ సమానమే! అందరూ ఒక్కటే! అని అన్నమాచార్యులవారు చెప్పడం జరిగింది.

ఈ విషయమే భగవద్గీతలో కూడా చెప్పబడింది.

**శ్లో॥ విద్యావినయ సంపన్నే బ్రాహ్మణే గవి హస్తిని**
**శుని చైవ శ్వపాకే చ పణ్డితాః సమదర్శినః ( భ.గీ. 5 - 18 )**

**తా**: విద్య, వినయము కలిగిన బ్రాహ్మణుడు, గోవు, ఏనుగు, కుక్క, మాంసము వండుకుని తినే చండాలుడు, వీరందరిపట్ల సమ దృష్టికలిగినవాడే పండితుడు. అంటే బాగా జ్ఞానం ఉన్నవాడు అని అర్థం.

కానీ ఈ జ్ఞానం లేకపోవడం వల్ల డబ్బున్నవాడు నేను చాలా గొప్పవాడిని, కారణ జన్ముడిని అనుకుంటాడు. లేని వాళ్ళను తక్కువగా చూస్తాడు. ఎవరైనా సాయం చేయమని అడిగితే తిడతాడు, పని చేసుకోవచ్చుగా అని అవతలికి పొమ్మంటాడు. వాడి భాద ఏంటో వీడు గ్రహించడు. వున్నా కూడా కొద్దిగా కూడా సాయం చెయ్యడు.

వాడు చివరకు చనిపోతాడు. చనిపోయిన తరువాత పైలోకాలలోని భువర్లోకం వెళతాడు. తరువాత కొన్నాళ్ళకు జనాలోకం చేరుకుంటాడు. అక్కడ కౌన్సిలింగ్ లు జరుగుతాయి.

అంత ధనవంతుడు అయి ఉండి కూడా లేని వాళ్ళకు సాయం చేయనందుకు కౌన్సిలింగ్ చేసే వాళ్ళు తిడతారు. ఏం నాయనా! ధనవంతుడిగా పుట్టి కూడా లేని వాళ్ళను అవమానించావు అంటే వాళ్ళ బాధ నీకు తెలియలేదు. అందుచేత నీవు పేదవాడిగా పుడితే వారి బాధ ఏంటో నీకు అర్థం అవుతుంది. పేదవాడి అనుభవం పొందితే నువ్వు అలా ప్రవర్తించవు అని చెప్పి పేదవాడి జన్మ తీసుకోమంటారు, ఆ రకమైన కర్మలు ఎంచుకోమంటారు, లేకపోతే నువ్వు పై లోకాలకు చేరుకోలేవు అని చెబుతారు. వాడు అర్థం చేసుకుని పేద వాడి

జన్మ ఎంచుకుంటాడు. ఎందుకంటే? పేదవాడి జీవిత అనుభవం పొందడం కోసం.

అలా పేదవాడి కుటుంబంలో జన్మిస్తాడు. అలాంటి తల్లితండ్రులను ఎంచుకొంటాడు. అందుచేత పుట్టుక నుంచి పేదవాదవుతాడు. అలా పేదవాడై నా బ్రతుకు ఇలా అయ్యిందే అని బాధపడతాడు.

దీనిని బట్టి ఆర్థికస్థితి ఎందుకు లేదు అంటే పేదవాడి అనుభవాలు పొందడం కోసం ఆ రకమైన జన్మ ఎంచుకున్నాడు కాబట్టి. నిజంగా చూస్తే అంతకు ముందు వాడు కోటీశ్వరుడు, కాని ఇప్పుడు పేదవాడు. అందుకే అంటారు **"బండ్లు ఓడలు – ఓడలు బండ్లు అవుతాయి"** అని.

అందుచేత డబ్బు ఉందని గర్వించకూడదు, గొప్పగా ఫీల్ అవ్వకూడదు. కారణం ధనం శాశ్వతం కాదు. అందుచేత ధనం ఉన్నప్పుడు ఆ ధనాన్ని తన అవసరాలకు ఉపయోగించు కుంటూ, ఉన్నదాన్ని లోకులకు, లోక కళ్యాణానికి ఉపయోగించాలి.

ఈవిషయమే షిర్డి బాబావారు ఈశావ్యాస ఉపనిషత్తులో చెప్పారు.

**శో॥ ఈశావాశ్య మిదం సత్యం యత్కించ జగత్యాం జగత్.**
**తేన త్యక్తేన భుంజిథా మాగ్రుధః కస్య సిద్ధనం. (81 – 97)**

తా:– అఖిల బ్రహ్మాండం లోని జడ, చైతన్య స్వరూపా లన్ని ఈశ్వరునిచే వ్యాపించి ఉన్నాయి. అంటే మొత్తం ఈ సృష్టిలోని జడ అంటే కదలికలేని, చైతన్యం అంటే కదలిక కలిగిన రూపాలన్నీ ఆ పరబ్రహ్మచే వ్యాపించబడి ఉన్నాయని బాబా వారు అర్థం చెప్పారు.

ఆయన ఇంకా ఏమన్నారంటే?అంతా పరబ్రహ్మదే కాబట్టి ఎవరికి ఏది లభించినా, ఉన్నా అది ఈశ్వరునిదే, ఈశ్వరుని నుంచి లభించినదేనని తెలుసుకోవాలి. అందుచేత ఈశ్వరుని నుంచి లభించిన ఐశ్వర్యాన్ని త్యాగ పూర్వకంగా అనుభవించాలి, పంచాలి. ఏ రకమైన లోభాన్ని, మోహాన్ని పెట్టుకోకూడదు, ఎవరిది ఆశించకూడదు, అపహరించకూడదని షిరిడి బాబావారు వివరణ ఇచ్చారు.

త్యాగపూర్వకంగా అంటే? మనకున్నదాన్ని అనుభవిస్తూ... ఉన్నంతలో ఇతరులకు కొంత సహాయం చేస్తూ ఉండాలి.

చాలా మందికి ఈ జ్ఞానం లేకపోవడంవల్ల, లక్షలు, లక్షలు గొప్పలకు, సరదాలు ఖర్చు పెడతారు. లోక కళ్యాణం కోసం కొద్దీగా కూడా వినియోగించరు.

ఒకవేళ వినియోగించినా ఏ కొద్దిగానో వినియోగిస్తారు. మరి అందరి కోసం ఖర్చు పెడితే ఎంత ఫలితం పొందగలరో వారికి తెలియదు.

తెలుసుకోండి అందరూ దైవ స్వరూపులే కాబట్టి అందరికి చేసిన సేవే దైవానికి చేసిన సేవ అవుతుంది. లోకుల్ని మెప్పిస్తే దైవాన్ని మెప్పించినట్లే. ఇది అర్థం చేసుకుంటే? ఈ జ్ఞానం ఉంటే? ఎవ్వరైనా ఇవ్వకుండా ఉండలేరు. ఈ జ్ఞానం లేకపోతే ఎంతవున్నా కొద్దిగా కూడా ఇవ్వలేరు.

మన లైఫ్ సక్సెస్ అవ్వాలి అంటే? మన భవిష్యత్తు బాగుండాలి అంటే? ఉన్నంతలో ఇవ్వడం నేర్చుకోవాలి. మరి అందరూ భీమవరానికి ఎందుకు వస్తున్నారు అంటే ఇవన్నీ నేర్చుకోవడానికి, తెలుసుకోవడానికి. అంటే జీవిత సూక్ష్మాలు తెలుసుకోవడానికి, జీవిత మర్మం తెలుసుకోవడానికి.

**ధనం సరిగా లేని చాలామంది ఇంక నా బ్రతుకు ఇంతేనా? పరిష్కారం లేదా? నేను ఇలా భాధ పడవల్సిందేనా? అని అనుకుంటారు. అందుచేత దానికి పరిష్కారం ఉందా? లేదా? అన్నది కూడా తెలుసుకుందాం.**

అలాగే ఆర్థిక స్థితి సరిగా లేకపోవడానికి ఇంకొక కారణం.

**3.ఆధ్యాత్మిక ఎదుగుదలకు ధనం అవసరం లేదు. పైగా ధనమన్నది పెద్ద అవరోధం అవుతుంది :** అందుకే కొంతమంది అవకాశం ఉన్నా సామాన్యమైన కుటుంబాన్నే ఎంచుకుంటారు.

చాలా మంది చాలా జన్మలు తీసుకొని ఉంటారు. అంటే 300 నుంచి 350 జన్మలు తీసుకుని వుంటారు. వాళ్ళకు ఇన్ని జన్మలు తీసుకున్నట్లు భూమిమీద తెలియదు కానీ, పై లోకాలలో ఎన్ని జన్మలు తీసుకున్నారు? ఏ ఏ జన్మలు తీసుకున్నారు? అన్న విషయం వాళ్ళకు తెలుస్తుంది. అలా వాళ్ళు రకరకాల జన్మలు తీసుకుంటారు. అలా అన్ని రకాల జన్మలు అయిపోయాక . వాళ్ళకు ఎంతసేపూ ఆధ్యాత్మికంగా ఎదగాలి... అంటే ఆత్మ పరంగా ఎదగాలి అనే భావంతో వుంటారు. పై లోకాలలో ఉన్నప్పుడు వారికి ఆధ్యాత్మికంగా ఎదగాలని అనిపిస్తుంది.

కారణం ఆధ్యాత్మికంగా ఎదిగిన వారు ఊర్ధ్వలోకాలకు చేరుకుంటారు. ఎందుచేతనంటే? అప్పటిదాకా జనాలోకం క్రింది లోకాలలోనే ఉన్నారు కానీ, జనాలోకం దాటి వెళ్ళలేదు. 300 నుంచి 350 జన్మలు, ఎత్తినాకూడా జనాలోకం క్రింది లోకాల్లోనే ఉన్నారు కాని జనాలోకం పైన వున్న గొప్పలోకాలకు వెళ్ళలేదు. అక్కడి వాళ్ళు వాడిని మందలిస్తారు. ఎన్ని జన్మలు ఎత్తుతావు? జనాలోకం

పైనఉన్న లోకాలకు వెళ్ళవా? ఆ లోకాలు ఎంతో గొప్పవి, అందుచేత ఆ ప్రయత్నం చెయ్యి అంటారు. అప్పుడు వీడు సరే వెళతాను ఏమి చేయాలి? అని అడుగుతాడు.

అప్పుడు వారు నీవు ఆధ్యాత్మికంగా ఎదగాలి అంటే ఆత్మ పరంగా ఎదగాలి, దానికి ఎంత ఆత్మ జ్ఞానం సంపాదిస్తే అంత గొప్పలోకాలకు చేరుకుంటావు, దాని కోసం ప్రయత్నించు అని చెపుతారు.

దానికి నేను ఏమి చేయాలి? అని అడుగుతాడు. దానికి వాళ్ళు ఇప్పటిదాకా దాకా నువ్వు ఎన్ని జన్మలు ఎత్తినా డబ్బు, డబ్బు అంటూనే భూమి మీద తిరిగావు.

దానివల్ల నీకేమి ఉపయోగం కలిగింది? ఉన్నత లోకాలకు చేరలేదు కదా? డబ్బు ఎక్కువ ఉంటే గర్వం పెరిగి ఆధ్యాత్మికంగా ఎదిగే ప్రయత్నం చేయవు . అందుచేత మిడిల్ క్లాసో! లోయర్ మిడిల్ క్లాసు కుటుంబాన్ని సెలక్ట్ చేసుకో! అప్పుడు నీ దృష్టి ధనం మీద కాకుండా ఆధ్యాత్మికం వైపు వుంటుంది అని ఆ పై లోకవాసులు చెబుతారు.

అప్పుడు వాడికి ఆధ్యాత్మిక ఎదుగుదలకు ధనం అవసరం లేదు అని అర్థం అవుతుంది. అందుచేత సామాన్యమైన సంసారాలనే ఎంచుకుంటాడు. వాడు కావాలనే ధనాన్ని ఎంచుకోడు, కావాలంటే ఎంచుకోవచ్చు కానీ అలా ధనాన్ని ఎన్ని జన్మలు అనుభవిస్తాడు. అందుకే వాడు ఆర్థిక స్థితి ఎంచుకోడు.

జీసస్ ఏమన్నారంటే? "ఒంటెను సూది బెజ్జంలో ఎక్కించవచ్చు కాని, ధనవంతుడు మోక్షం పొందడం అన్నది అసాధ్యం" అన్నారు.

అందుకే చూడండి లోకంలో చాలామంది ధనవంతులు ఉంటారు. వారిని ధ్యానం చెయ్యమంటే ఖాళీ లేదంటారు, మాకు చాలా పనులు వున్నాయి అంటారు. మరి ధ్యానం చెయ్యకపోతే జ్ఞానం ఎలా వస్తుంది? జ్ఞానం పొందకపోతే మోక్షం ఎలా వస్తుంది? ఎన్ని జన్మలు ఎత్తినా రాదు. అందుకే ఆధ్యాత్మికంగా ఎదగాలనుకునే వారు చాలా మంది ఆర్థికంగా సామాన్యమైన కుటుంబాన్నే ఎంచుకుని వస్తారు.

మనం గమనిస్తే మన సోసైటీలో ఈ ఆధ్యాత్మిక మార్గంలోకి వచ్చినవారిలో మిడిల్ క్లాస్, లోయర్ మిడిల్ క్లాస్ ఫ్యామిలీలే ఎక్కువ వుంటారు. అంటే మధ్యతరగతి, ఇంకా తక్కువ వారే ఉంటారు. కోటీశ్వరులు చాలా స్వల్పంగా ఒక్కళ్లో ఇద్దరో ఉంటారు.

మీరు అడగవచ్చు మీకు ధనం ఉంది కదా? అని. దానికి కూడా కారణం ఉంది. కొంతమంది అంటే బాగా ఎదిగిన ఆత్మలు ధనాన్ని లోక కళ్యాణానికి మాత్రమే ఖర్చు పెడతారు. కారణం వారు అలా నిర్ణయించుకొని వస్తారు కాబట్టి ఆ స్థితి ఉంటుంది, అంతకన్నా ఇంకేమి కాదు.

చూడండి నేను ధనవంతుల కుటుంబంలో పుట్టినా కూడా, పత్రి గారి ద్వారా జ్ఞానాన్ని తెలుసుకుని అన్ని వ్యాపారాలు వదిలేసాను. ఎందుచేతనంటే? నా ప్రణాళిక ధన సంపాదన కాదు, నేను సంపాదించుకున్న జ్ఞానం నా ద్వారా ఎంతో మందికి అందవలసి ఉంది. అందుకే పత్రీజీ పరిచయం కాగానే నా వ్యాపారాలన్నీ వదిలేసాను.

అంతే కాదు, మేము ధ్యానం క్లాస్‌లు నిర్వహించే ధ్యానమందిరము, కళ్యాణ మండపం అన్నీ కూడా 1988లోనే నిర్మించడం జరిగింది. అప్పటి నుంచి 2002 పత్రి గారు పరిచయం అయ్యే వరకు ఖాళీగానే ఉన్నాయి. మరి అవి ఎందుకు కట్టానో అప్పుడు నాకే అర్థం కాలేదు , కానీ కట్టడం జరిగింది. కానీ పత్రి గారి పరిచయం అయ్యాక నా ప్రణాళిక ప్రకారం దాన్ని ముందే నిర్మించుకోవడం జరిగిందని అర్థం అయ్యింది.

చాలా మంది పత్రిగారిని అడిగారట... ఏమండీ మా దగ్గర డబ్బు లేదు, ఉంటే మేము ఎన్నో సేవలు చేద్దుము అని అన్నారట. దానికి పత్రి గారు ఒరే నాయనా డబ్బు లేదు కాబట్టే నువ్వు చేస్తున్నావు, అదే గనక ఉంటే చేయవురా అన్నారట. అందుకే గమనించండి ఎవ్వరికైనా లేని డబ్బు వచ్చింది అంటే కళ్ళు నెత్తిమీదకు ఎక్కుతాయి. డబ్బు లేకపోతేనే అణిగి మణిగి ఉంటారు. ఏ మాత్రం డబ్బు వచ్చినా వాడిని పట్టుకోలేము. అందుచేత ఈ కారణంగా కూడా ఆర్థిక స్థితి ఉండదు.

అందుకే మీరు ధ్యానంలోకి వచ్చారు అంటే? మీరు అంతకుముందు జన్మల్లో మోసాలు చేసి, అధర్మంగా సంపాదించి ఆర్థికంగా చాలా పాపాలు చేసిన వాళ్ళు కాదు. మీరు ఆధ్యాత్మిక ఎదుగుదలకు వచ్చిన వాళ్ళు. మీకు డబ్బు వున్నా, డబ్బు లేక పోయినా, మీ పరిధిలో మీరు సేవలు చేస్తారు. మనం గమనిస్తే పత్రీజీ మార్గంలో చాలామంది అలాంటి వాళ్ళే ఉన్నారు.

గుర్తుంచుకోండి మీరందరూ వచ్చింది ఆధ్యాత్మిక ఎదుగుదలకు కాని, ఆర్థిక ఎదుగుదలకు కాదు. అందుచేత వచ్చిన పని మానేసి ధనం పెంచుకోవడానికి ప్రయత్నిస్తే మీకు గట్టి దెబ్బలే తగులుతాయి.

# 3.ఆర్థిక స్థితి పెంచుకోవాలంటే?

ఇవన్నీ విన్న తర్వాత  చాలా మంది మరి నా జీవితం ఇంతేనా? ఏ దారి లేదా? ఇలాగే ఉండిపోవాలా? నేను సంపాదించుకునే అవకాశం లేదా? అని అనుకోవచ్చు. కానీ కావాలనుకుంటే! ఇప్పుడైనా మీరు ఆర్థిక స్థితి పెంచుకోవచ్చు. కానీ సృష్టి నియమాలను అనుసరించి ప్రయత్నించాలి.

ధనం ఉన్నవాడిని చాలామంది ఏమంటారంటే? వాడు చాలా అదృష్టవంతుడు రా అంటారు. లేనివాడిని దురదృష్టవంతుడు అంటారు. అంతేకాదు చాలామంది భగవంతుడు నాకు ఈ అదృష్టం కల్పించాడు, అని కలిసి వచ్చిన వారు అనుకుంటూ ఉంటారు. భగవంతుడు నన్ను దురదృష్టవంతుణ్ణి చేశాడని కలిసి రాని వారు అనుకుంటారు.

కానీ ఆలోచిస్తే ఇదంతా భగవంతుడు చేసింది కాదు. ఎవరికి వారు చేసుకున్నదే! ఎందుచేతనంటే? ఎవరికి వారు చేసుకొని సంపాదించుకున్న అర్హతను బట్టే అలా ఉంది. అందుచేత కష్టపడడం, కృషి చేయడం ప్రధానం కాదు, అర్హత సంపాదించుకోవడమే ప్రధానం.

అందుకే చూడండి రిలయన్స్ ముకేశ్ అంబానీకి మనవడు పుడితే, వాడు పుట్టుకతోనే అపర కోటీశ్వరుడు అయిపోతాడు. అలాగే పేదవాడికి కానీ, కూలి వాడికి కానీ కొడుకు పుడితే, వాడు పుట్టుకతోనే దరిద్రుడు అవుతాడు. ఆలోచించండి! అంబాని మనుమడు పుట్టగానే ఎందుకు కోటీశ్వరుడు అయ్యాడు? అసలు వాడు ఏమి కష్టపడ్డాడు? ఏమి కృషి చేశాడు? అప్పుడే కదా పుట్టింది? ఏ కష్టం లేకుండా, ఏ కృషి లేకుండా కోటీశ్వరుడు అయ్యాడు కదా? ఇంకా ఆలోచిస్తే భగవంతునికి అందరూ సమానమే కదా? ఆయనకు రాగద్వేషాలు లేవు కదా?

మరి కొంతమందిని ధనవంతులుగా, కొంతమందిని పేదవాడిగా ఎందుకు చేస్తాడు? చెయ్యడు కదా? మరి అలా పుట్టటానికి కారణం ఏమిటి? అంటే అర్హతే. అందుచేత తెలుసుకోండి, కొంతమంది గతంలో అర్హత సంపాదించు కున్నారు, కోటీశ్వరులు అయ్యారు. ముష్టివాడి కొడుకు అర్హత సంపాదించు కోలేదు, దరిద్రుడు అయ్యాడు. అందుచేత ఆర్థిక స్థితి అన్నది అర్హతను బట్టి వస్తుంది తప్ప, రాత్రి పగలు కష్టపడే దాన్నిబట్టి రాదు.

మరి ఈ సృష్టిలో 'అర్హత' ఎలా వస్తుంది? అన్న సందేహం చాలా

మందికి రావచ్చు. కానీ ఈ సృష్టిలో అర్హత అన్నది ఇస్తే వస్తుంది, ఇవ్వకపోతే రాదు. అంతేకాదు ఏది ఇస్తే అదే వస్తుంది, ఎంత ఇస్తే అంతే వస్తుంది. అందుచేత ఈ సృష్టిలో ఆర్థిక స్థితి పెరగాలని అనుకునేవారు కచ్చితంగా అర్హత సంపాదించు కోవాలి... అంటే ఇవ్వవలసిందే!

అందుచేత ధనం పెరగాలంటే ధనం ఇవ్వాలి. ఎక్కువ ధనం కలగాలంటే? ఎక్కువ ఇవ్వాలి.

ఇక్కడ చాలా మందికి సందేహం రావచ్చు. కోట్లు ఇచ్చి, కోట్లు పొందడం ఎందుకు? కోట్లు మనమే ఉంచుకోవచ్చు కదా? అని అనుకోవచ్చు. అలాగే కొంతమంది కోట్లు ఇవ్వాలంటే కోట్లు నా వద్ద ఉండాలి కదా? అని అనవచ్చు. అంత ధనం లేని నేను, కోట్లు ఎలా ఇవ్వగలను? నాకు కోట్లు సంపాదించే అర్హత ఎలా వస్తుంది? ఆ అవకాశం కోట్లు ఉన్న వారికే సాధ్యం కాని, లేని నాకు ఎలా సాధ్యం? అని అనుకోవచ్చు. ఇంకా కొంతమంది, మా దగ్గర డబ్బు లేదు, సేవా కార్యక్రమాలు చేద్దామన్నా చేయలేక పోతున్నాం, అలాంటి అవకాశం డబ్బున్న వారికే సాధ్యం కాని, మాలాంటి వారికి సాధ్యం కాదు కదా? అని అనుకోవచ్చు.

ఇంకా కొంతమంది భగవంతుడు మమ్మల్ని పేదవారిని చేసి, సేవచేసే భాగ్యం కూడా లేకుండా చేశాడు, ధనవంతులులా సంపాదించుకునే అవకాశం మాకు లేదు, అని బాధపడుతూ ఉంటారు. అంతేకాదు ఇంకా ఏమని అనుకుంటారంటే? ఈ సృష్టిలో కోటీశ్వరులకే, కోటీశ్వరులు కాగల అవకాశం ఉంది, కానీ మాలాంటి పేదవారికి ఆ అవకాశం లేదేమోనని బాధపడేవారు కూడా ఉన్నారు.

కానీ భగవంతుడు ఈ సృష్టిలో ధనవంతులకు, పేదవారికి అందరికీ కోట్లు సంపాదించుకునే అవకాశం సమానంగా కల్పించాడు. కారణం ఆయనకు అందరూ సమానమే. అందుచేత అదెలాగో తెలుసుకుందాం. ఇక్కడ మానవుల లెక్కకు, సృష్టిలోని లెక్కకు చాలా తేడా ఉంది. మానవులు ఎంత ఇచ్చాడు అన్నది చూస్తారు, కానీ సృష్టిలో ఎంత శాతం ఇచ్చాడు అన్నది చూడబడుతుంది.

అంటే కోటి రూపాయలు ఉన్నవాడు లక్ష దానం చేస్తే, లోకంలో చాలా ఎక్కువ దానం ఇచ్చినట్టు లెక్కిస్తారు. కానీ వాడికంటే వెయ్యి రూపాయలు ఉన్నవాడు 900 దానం చేసినా, లక్ష ఇచ్చిన వాడికంటే ఎక్కువ దానం ఇచ్చినట్టుగా సృష్టిలో లెక్కించ బడుతుంది. కారణం కోటి ఉన్నవాడు ఒక

శాతం ఇస్తే, 1000 ఉన్నవాడు 90 శాతం దానం ఇచ్చినట్టు. అంటే ఉన్న వాడి కంటే లేనివాడు ఎక్కువ దానం ఇచ్చినట్టు.

అందుచేత ఈ సృష్టిలో ఎవరైనాసరే ఎక్కువ అర్హత సంపాదించాలంటే? తనకు ఉన్నదాంట్లో అంటే సృష్టినుంచి తనకు ఇవ్వబడిన దాంట్లో వీలైనంత ఎక్కువ ఇవ్వాలి. ఎందుచేతనంటే? సృష్టిలో ఉన్నదాంట్లో ఎంత ఎక్కువ ఇచ్చాడు అన్నది లెక్కించ బడుతుంది కాని, ఇచ్చిన మొత్తం చూడబడదు.

అందుచేత భవిష్యత్తులో 900 ఇచ్చినవాడు కోటీశ్వరుడు అవుతాడు, లక్ష ఇచ్చినవాడు సామాన్యుడు అవుతాడు. అందుచేత ఎంత ఇచ్చాము అన్నది కాదు? ఉన్నదాంట్లో ఎంత ఇచ్చాము? అన్నది ముఖ్యం. అంటే ఎంత శాతం ఇచ్చాము అన్నది ముఖ్యం.

దీనిని బట్టి ఎవరైనాసరే! తనకు ఉన్నదాంట్లో ఎంత ఎక్కువ ఇవ్వగలిగినా ఈ సృష్టిలో కోట్లు ఇచ్చినట్టే! అంతేకానీ కోట్లు ఇస్తేనే కోట్లు ఇచ్చినట్లు కాదు. అందుచేత సృష్టిలో అర్హత సంపాదించాలంటే? మీకు ఉన్న దాంట్లో ఎక్కువ ఇవ్వగలిగితే చాలు. కోట్లు ఇవ్వవలసిన అవసరం లేదు.

అందుచేత సృష్టిలో ఉన్నవాడికి, లేనివాడికి ఇద్దరికి, భవిష్యత్తులో కోట్లు సంపాదించునే అవకాశం ఉంది. అలా ఉన్న దాంట్లో ఎక్కువ ఇచ్చిన వాడు గొప్పవాడు అవుతాడు, భవిష్యత్తులో లాభ పడతాడు, అర్హత సంపాదించుకున్న వాడు అవుతాడు.

సృష్టిలోని పై విషయాన్ని మనకు అర్థమయ్యేటట్టు, పూర్వం పండితులు కొన్ని పురాణ కథల ద్వారా తెలియజేయడం జరిగింది.

అది ఇప్పుడు తెలుసుకుందాం.

భారత యుద్ధానంతరం ధర్మరాజు రాజ్యాన్ని పాలించే రోజులలో, ఒక పెద్ద యాగాన్ని చేశాడు. యాగానంతరం ఆ రాజ్యంలోని వారందరికీ షడ్రసోపేతమైన విందు భోజనం ఏర్పాటు చేశాడు. విందు అనంతరం అడిగినవారికి కాదనకుండా దానాలు ఇచ్చాడు. ఆ విందును, ఆయన ఇచ్చే దానాలు చూసి అందరూ ఆశ్చర్య పోయారు. ధర్మరాజును వేనోళ్ళ పొగిడారు. అంతటి దానం ఇంతకుముందు ఎవరు చేసి ఉండరు, ఇకముందు కూడా ఎవరు చెయ్యలేరు అని ధర్మరాజును వేనోళ్ళ ప్రశంసించారు.

అలా అంతా ధర్మరాజును పొగుడుతుంటే! ధర్మరాజు తనలో తానే

పొంగిపోవడం మొదలుపెట్టాడు. అంతటి గొప్ప దానాన్ని నేను చెయ్యగలిగాను అన్నమాట, నేను ఎంతటి అదృష్టవంతుణ్ణి? ఎంతటి గొప్పవాణ్ణి? నాకు ఎంతటి అదృష్టం కలిగింది? అని తనలో తాను పొంగిపోవడం మొదలుపెట్టాడు, అతనిలో అహంకారం ప్రవేశించింది.

కానీ ముఖ్యంగా మనం తెలుసుకోవలసింది, ఎవరిలోనైతే అహంకారం ప్రవేసిస్తుందో! వారు ఎంతటి గొప్పవారైనా, మెల్లిగా వారి పతనం ప్రారంభమైనట్లే! ఆ సభలోనే శ్రీ కృష్ణుల వారు కూడా ఉన్నారు. సహజంగా అందరి మనసులో ఏమి ఉందో తెలుసుకోగలరు శక్తి ఉన్న శ్రీ కృష్ణుల వారికి, ధర్మరాజు ఆలోచనలు తెలుసుకున్నారు. అలా అహంకారం బయలుదేరితే ధర్మరాజు కైనా పతనం తప్పదని గ్రహించి, ధర్మరాజుకు బుద్ధి చెప్పడానికి కృష్ణులవారు అక్కడ ఒక చిన్న సంఘటన సృష్టించారు.

ఆ సమయంలో అందరికీ ఆశ్చర్యం గొలిపే విధంగా ఆ సభలోకి ఒక ముంగిస ప్రవేశించింది. ఆ ముంగిసను చూడగానే అందరూ ఆశ్చర్యం పోయారు. కారణం ఆ ముంగిస సగం బంగారు రంగులో, సగం మామూలుగానే ఉంది. అంతేకాదు ఆ ముంగిస చేసే పని చూసి అక్కడ ఉన్న వారందరికీ ఇంకా ఆశ్చర్యం వేసింది. కారణం ఆ ముంగిస అక్కడ ఉన్న ఎంగిలి ఆకులలోని మెతుకులు తింటూ, ఆకుల్లో దొర్లుతూ ఉంది. అందరూ దానినే ఆశ్చర్యంగా చూస్తున్నారు.

అలా దొర్లి, దొర్లి మాట్లాడటం మొదలు పెట్టింది. అందరూ ధర్మరాజు చేసింది గొప్ప దానం ప్రశంసిస్తున్నారు, ఇంతకన్నా గొప్పదానం లేదని అంటున్నారు. కానీ ధర్మరాజు చేసింది గొప్ప దానమే కాదు అని అంది. ఆ ముంగిస మాట్లాడటం, అందులోనూ అందరూ ప్రశంసిస్తున్న దానికి విరుద్ధంగా, ధర్మరాజు చేసింది గొప్పదానం కాదు, అని అనడంతో, ఆ సభలోని వారందరూ ఆశ్చర్య చకితులై చూడటం మొదలుపెట్టారు. సభ అంతా ఒక్కసారిగా నిశ్శబ్దం అలుముకుంది. అందరూ ఆ ముంగీసనే చూస్తున్నారు.

ఆ సభలోనే ఉన్న ధర్మరాజు సోదరులకు ముంగిస మాటలు విపరీతమైన ఆగ్రహాన్ని తెప్పించాయి. వారు ఆ ముంగిసను ఏమిటి ధర్మరాజు చేసింది గొప్పదానం కాదా? అసలు ఇంత కన్నా గొప్ప దానం ఎవరు చేయగలరు? ఈ రాజ్యంలో అందరూ ప్రశంసిస్తూ ఉంటే! నువ్వు కాదు అంటున్నావే! వారందరికంటే నువ్వు గొప్ప దానివా? అసలు దానం గురించి

నీకేం తెలుసు? అని కోపంతో ముంగిస మీదకు రాబోయారు.

అప్పుడు ధర్మరాజు వారిని వారించి, ఆ ముంగిసతో ఇలా అన్నాడు. మహాత్మ మీరు మాట్లాడుతున్నారంటే! మీరు గొప్పవారు అని అర్థం అవుతుంది. మరి నేను చేసింది గొప్పదానం కాకపోతే? అసలు ఏ దానం గొప్పది? అంతటి గొప్పదనం చేసినవారు ఎవరైనా ఉన్నారా? ఉంటే కాస్త దయవుంచి, నాకు సెలవియ్యండి, అని ఆ ముంగిసతో ధర్మరాజు అన్నాడు.

అప్పుడు ఆ ముంగిస ఇలా చెప్పడం మొదలు పెట్టింది. ఆ సభలోని వారంతా ఆసక్తిగా ఆ ముంగిస మాటలు వింటున్నారు. ధర్మరాజా! మీ రాజ్యంలోనే ఒక గ్రామంలో ఒక పేద బ్రాహ్మణుడు ఉన్నాడు, ఆయన కుటుంబానికి కొద్దిపాటి భూమి ఉంది. ఆ భూమిలో పండిన పంటతో కుటుంబాన్ని పోషించుకుంటూ, వచ్చిన వారికి లేదనకుండా అన్నదానం చేసేవాడు. అలా ఉండగా ఒక సంవత్సరం వర్షాలు సరిగా లేని కారణంగా, పంట సరిగా పండలేదు. అందుచేత వారి ఇంటిలో గింజలు తొందరగా అయిపోయాయి. వారికి ఎలాంటి పరిస్థితి వచ్చిందంటే? వారు తినడానికి కూడా ఏమీ లేదు. నీరు త్రాగుతూ, పస్తులు ఉంటూ కొన్ని రోజులు కాలక్షేపం చేశారు. కాని చివరకు ఆ కుటుంబ సభ్యులు ఆకలితో ప్రాణాలు కోల్పోయే పరిస్థితి వచ్చింది. అప్పుడు ఆ బ్రాహ్మణుడు మరల తన పొలంలోకి వెళ్ళాడు. ఆ భూమిలో అక్కడక్కడ రాలిన గింజలు ఏరాడు. ఒక దోసెడు గింజలు వచ్చాయి. వాటిని దంచగా వచ్చిన బియ్యంతో అన్నం వండాడు. ఆ వండిన అన్నం ఆ కుటుంబంలోని వారందరికీ తలోక ముద్ద వచ్చింది. వారు ఏమనుకున్నారంటే! ఈ ముద్దను తిని, మనం ప్రాణాలు నిలబెట్టు కుంటే! రేపు భగవంతుడు ఏదో ఒక దారి చూపించక పోతాడా? అనే ఉద్దేశంతో ఆకులలో తలొక ముద్ద ఉంచుకొని, తినటానికి సిద్ధమయ్యారు.

ఇంతలో అనుకోని రీతిలో ఒక అతిథి, ఆ ఇంటికి వచ్చాడు. నాకు చాలా ఆకలిగా ఉంది, ఏదైనా పెట్టమని ఆ బ్రాహ్మణుణ్ణి అర్థించాడు. అడిగినవారికి లేదనకుండా ఆతిథ్యం ఇచ్చే ఆ బ్రాహ్మణుడు ఆలోచించాడు! వున్నది అతిథికి ఇస్తే తన ప్రాణాలు పోతాయి, ఇవ్వకపోతే ఎన్నాళ్ళనుంచో లేదనకుండా ఇచ్చి, ఈరోజు అతిధిని నిరాశ పరిచిన వాడిని అవుతాను అని ఆలోచించాడు. ఆయన ఇంకా ఏమని ఆలోచించాడు అంటే! ఒకవేళ నేను అతిధిని నిరాశపరిచి నేను ఆహారం తిన్నా, అది ఈరోజు వరకే! రేపు ఎలాగూ

ప్రాణాలు కోల్పోవాల్సిందే! అందుచేత రేపు పోయే ప్రాణం ఈ రోజు పోతుంది. అంతే కదా? కనీసం ప్రాణం పోయేముందు, ఒక అతిధిని తృప్తి పరచిన వాడిని అవుతాను అని అనుకుని, తాను తినాలనుకున్న ముద్ద మొత్తం అతిధికి ఇచ్చాడు.

అతిథి ఆ ముద్దను తిని నాకు ఇంకా ఆకలి తీరలేదని అన్నాడు. అప్పుడు ఆ కుటుంబ సభ్యులంతా ఆలోచించారు. ఆ బ్రాహ్మణుడు లాగే, ఎలాగూ రేపు మన అందరి ప్రాణం పోక తప్పదు, అందుచేత ఒక అతిథిని తృప్తిపరిస్తే అంతకన్నా కావలసింది ఏముందని చెప్పి, వారంతా తాము తినే ముద్దలను అతిథికి ఇచ్చారు. అప్పుడు అతిధి అవి కూడా తిని, నా ఆకలి తీరింది అని సంతృప్తి చెంది, ఆ కుటుంబం సభ్యులకు ధన్యవాదాలు చెప్పి వెళ్ళిపోయాడు.

సరిగ్గా అదే సమయంలో ఒక ముంగిస ఆకలితో ఆ ఇంటిలో ప్రవేశించింది. ఇల్లంతా తిరిగింది, కాని దానికి ఏమి కనిపించలేదు. చూస్తే ఆ అతిథి తిన్న ఆకులలో కొన్ని మెతుకులు కనిపించాయి. ఆకలితో ఉన్న ఆ ముంగిస వెంటనే వెళ్లి ఆ మెతుకులు తింది. ఆశ్చర్యం ఆ మెతుకులు తినగానే దాని శరీరం సగం బంగారువర్ణంగా మారిపోయింది. ఈ పరిణామానికి ముంగిస ఆశ్చర్య పోయింది. అప్పుడు ఆ ముంగిసకు అర్థమయ్యింది. ఇదంతాఈ బ్రాహ్మణుడు చేసిన దాన మహిమ అని అర్థం చేసుకుంది. ఆ బ్రాహ్మణుడు చేసింది అత్యంత గొప్ప దానం అని అర్థం చేసుకుంది. అక్కడ నుంచి వెళ్ళిపోయింది.

తరువాత ముంగిసకు ఒక కోరిక కలిగింది. ఇలా సగం శరీరం బంగారు వర్ణంగా ఉంటే ఏమి బాగుంది, మొత్తం శరీరమే బంగారంగా మారిపోతే ఎంత బాగుంటుంది, అని అనుకుని ఆ బ్రాహ్మణునిలాగే ఇంకా ఎవరైనా గొప్పగా దానం చేసేవారు ఉంటే, వారి ఇంటిలో కూడా అలా తిని మిగిలిన శరీరం కూడా బంగారంగా మార్చుకోవాలని భావించింది. అలా దానాలు చేసేవారి ఇళ్ళకు తిరిగింది. అలా చాలా చోట్లకు తిరిగింది. కానీ ఆ ముంగిస శరీరం మాత్రం బంగారంగా మారలేదు, ఎక్కడ దానాలు జరుగుతున్నా అక్కడకు వెళ్ళింది, కానీ ప్రయోజనం కనబడలేదు. అలా తిరుగుతూ ఉంటే, ఎవరో ఆ ముంగిసకు చెప్పారు, ఎందుకు అక్కడకు, ఇక్కడకు తిరుగుతావు, ధర్మరాజు అందరికంటే గొప్పదానం చేస్తున్నాడని అందరూ చెప్పుకుంటున్నారు.

నువ్వు కూడా ఒక్కసారి వెళ్లి ప్రయత్నిస్తే నీ కోరిక నెరవేర వచ్చు కదా? ఒకసారి వెళ్లి ప్రయత్నించు, అని సలహా ఇవ్వగానే నేను ఇక్కడికి వచ్చాను. ఎంగిలి ఆకులలో మెతుకులు తిన్నాను, దొర్లాను, కానీ నా శరీరం బంగారంగా మారలేదు. అంటే నువ్వు చేసింది గొప్పదానం కాదని అర్థం చేసుకున్నాను.

మరి చెప్పు ధర్మరాజా నువ్వు చేసింది గొప్ప దానమా? ఆ బ్రాహ్మణుడు చేసింది గొప్ప దానమా? అని అడిగింది. ఆ బ్రాహ్మణుడు ఏమీ లేకపోయినా, చావడానికి సిద్ధంగా ఉన్నా, తాను తినే ముద్దను దానం చేశాడు. మరి నువ్వు చక్రవర్తివే, ఎన్ని దాన ధర్మాలు చేసినా అటువంటి అపార ధనరాసులు నీ దగ్గర ఉన్నాయి. అందులో కొంత మాత్రమే నువ్వు దానం చేసావు, నీకు ఉన్నదంతా చేసావా? లేదు కదా? అందుచేత ఆ బ్రాహ్మణుడి దానం ముందు నీది గొప్పదానం ఎలా అవుతుంది చెప్పు? అని ముంగిస అడిగింది.

అలా అనగానే ధర్మరాజు అర్థం చేసుకున్నాడు, ఆ బ్రాహ్మణుడు చేసిన దానం ముందు తాను చేసింది చాలా తక్కువ అని తెలుసుకున్నాడు. అహంకారంతో గర్విస్తున్న తనకు, ఈ రకంగా గుణపాఠం చెప్పబడిందని తెలుసుకున్నాడు. తనకు జ్ఞానోదయం కలిగించినందుకు, ఆ ముంగిస కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. ఇదంతా శ్రీ కృష్ణుల వారు ఆడించిన నాటకం అని గ్రహించాడు, శ్రీ కృష్ణులవారికి నమస్కరించాడు.

దీనిని బట్టి ఈ సృష్టిలో ఎంత ఇచ్చాము అన్నది కాదు, ఉన్నదాంట్లో ఎంత ఎక్కువ ఇచ్చాము అన్నదే లెక్కించబడుతుంది. అందుచేత దానం చేయడానికి కోట్లు అవసరం లేదు, తన దగ్గర ఎంత ఉన్నా, దానిలో ఎంత ఎక్కువ ఇచ్చినా, అది గొప్పదానమే అవుతుంది.

ఎందుచేతనంటే చాలామంది మా దగ్గర ఎక్కువ ధనం లేదు, మేము దానం చేద్దామనుకున్నా, చేయలేక పోతున్నాము. వారికి చాలా ధనం ఉంది, అందుచేత వారు దానాలు చేస్తున్నారు, పుణ్యకార్యాలు చేస్తున్నారు. మాకు ఆ అదృష్టం లేదు అని బాధపడుతూ ఉంటారు. దానం చేయాలంటే ధనమే వుండాలని అని అనుకుంటారు. అలా అనుకుని చాలామంది పుణ్యకార్యాలు చేయడం కోసం, ధనం సంపాదించే ప్రయత్నం చేసేవారు కూడా ఉన్నారు. బాగా సంపాదిస్తే, బాగా దానాలు చేయవచ్చని వారు భావిస్తూ ఉంటారు.

అలా చాలామంది పుణ్యం చేయడం కోసమని పాపాలు చేస్తూ, సంపాదించే వారు కూడా ఉన్నారు. ఇది చాలా తెలివి తక్కువ పని.

ఎందుచేతనంటే? వీరు సంపాదించే పుణ్యం తక్కువ, కానీ సంపాదించడానికి చేసే పాపాలు ఎక్కువ ఉంటాయి. ఒకరకంగా పుణ్యం చేయడం కోసం, సంపాదించే పాపం వల్ల అంతా నష్టమే జరుగుతుంది, తప్ప లాభమే వుండదు.

అందుచేత ఉన్నదానితో సంతృప్తి చెందండి, ఉన్న దానిలోనుంచే ఇవ్వడానికి ప్రయత్నించండి. తెలుసుకోండి దానాలు చేయడానికి ప్రత్యేకించి సంపాదించవలసిన పని లేదు, మీకు ఈ సృష్టిలో ఇవ్వబడింది చాలు, దాని నుంచే ఎంత ఇవ్వగలరో! అంతా ఇవ్వండి. సంపాదించి ఎక్కువ ఇవ్వడం కాదు, ఉన్న దాంట్లో ఎక్కువ ఇవ్వండి, అదే గొప్ప దానం అవుతుంది. వేలు ఉన్నవాడు వందలు ఇచ్చినా, ఈ సృష్టిలో కోట్లు ఇచ్చినట్టే లెక్క. వాడు భవిష్యత్తులో కచ్చితంగా కోటీశ్వరుడు అవుతాడు.

ఒకవేళ నీ దగ్గర ధనం లేకపోతే, సమయాన్ని దానం చెయ్యండి, దానినే సమయ దానం అంటారు. వాక్కును దానం ఇవ్వండి, మీ శ్రమను దానం చెయ్యండి, మీకు ఉన్న దాంట్లో ఏది దానం చేసినా, ఈ సృష్టిలో మీరు అర్హత సంపాదించు కొంటారు. భవిష్యత్తులో మీ జీవితం వైభవంగా ఉంటుంది.

మరి సమయాన్ని, ఎలా దానం చేయగలం? అంటే మనకున్న సమయంలో, కొంత సమయాన్ని లోక కళ్యాణకరమైన పనులకు కేటాయించండి. అంటే అందరిచేత ధ్యానాన్ని చేయించండి. వాక్కును దానం చెయ్యాలంటే! అందరికీ ధ్యానాన్ని చెప్పండి, జ్ఞానాన్ని బోధించండి. అలాగే శ్రమను దానం చెయ్యాలంటే ధ్యాన సంబంధమైన కార్యక్రమాల్లో పాల్గొనండి, అలాంటి కార్యక్రమాలు చేసేవారికి సహకరించండి.

అప్పుడు మీరు అంతులేని దానం చేసినవారు అవుతారు. భవిష్యత్తులో, భవిష్యత్తు జన్మలలో ధనవంతులు కాగలుగుతారు, ఆర్థిక స్థితి బాగా పెరుగుతుంది. అందుకే అంటారు "చేసుకున్న వాడికి చేసుకున్నంత మహాదేవ" అని.

ఇక్కడ మనకు కొన్ని సందేహాలు వస్తూ ఉంటాయి. ఎందుచేతనంటే! లోకంలో గమనిస్తే, మొదట్లో కొంతమందికి ఆర్థిక స్థితి బాగుండదు, తక్కువగా ఉంటుంది. కానీ తరువాత వారికి అనుకోకుండా కలిసి వస్తుంది, కోటీశ్వరులు అవుతారు, ఆర్థిక స్థితి అనూహ్యంగా మారిపోతుంది. మరికొంతమందికి మొదట్లో ఆర్థిక స్థితి చాలా బాగుంటుంది, చాలా ధనవంతులుగా ఉంటారు. కానీ మెల్లిగా వారి ఆర్థిక స్థితి మారిపోతుంది. వారి ఐశ్వర్యం అంతా కోల్పోతారు.

ఇంకా కొంతమంది ఎప్పుడూ ఒకే రకమైన ఆర్థిక స్థితిలో ఉంటారు. ఇలా ఎందుకు జరుగుతుందో! ఒక్కొక్కసారి అర్థం కావు.

సామాన్యంగా ఏమంటారంటే! కలిసి వచ్చిన వాడిని అదృష్టవంతుడు అంటారు, కలిసి రాని వాడిని దురదృష్టవంతుడు అంటారు. కానీ ఇలా జరగడానికి కారణం లేకపోలేదు.

చిన్న ఉదాహరణ చూద్దాం:

పూర్వకాలంలో ధాన్యం నిల్వ ఉంచే గాదులలో అంటే ధాన్యం కొట్టాలలో, రకరకాల ధాన్యం నిల్వ ఉంచే వారు. ఉదాహరణకు ముందు గాది అడుగున నాసిరకం ధాన్యం పోశారనుకుందాం. తర్వాత మంచిరకం, నాణ్యమైన ధాన్యం పోశారని అనుకుందాం. కొన్ని నెలల తరువాత, ధాన్యం కోసం మీరు గాదె అడుగున ఉన్న తలుపు తీస్తే, ముందు నాసిరకం ధాన్యం బయటకు వస్తాయి. కానీ పైన పోసిన మంచి ధాన్యం రావు. నాసిరకం ధాన్యం అయిపోయిన తరువాతే, మంచి ధాన్యం వస్తాయి.

అలాగే గతంలో కానీ, గత జన్మలో కానీ ముందు ఏమీ చేయకుండా, తరువాత పుణ్యకార్యాలు చేశారు అనుకోండి, అంటే అందరికీ ధనాన్ని దానం చేశారనుకోండి, ప్రస్తుత ప్రారంభ జీవితంలో ఆర్థిక స్థితి తక్కువగా ఉంటుంది, తర్వాత అనుకోని రీతిలో ధనం పెరుగుతుంది, అంటే ధనవంతులు అవుతారు. అంతేకాని ధనం ప్రాప్తి0చడానికి ప్రస్తుత కృషి, తెలివి మాత్రం కాదు. అవి పైకి కనిపించే కారణాలు మాత్రమే. అంతా గతంలో సంపాదించుకున్న అర్హతే!

ఎందుచేతనంటే ధనం కోసం రాత్రి పగలు కష్టపడేవారు, తెలివిని ప్రదర్శించేవారు ఎంతోమంది ఉన్నారు. మరి అంతా సంపాదించ గలుగుతున్నారా? అందరికీ కలిసివస్తుందా? అంటే లేదనే చెప్పవచ్చు.

అలాగే గాదులలో ముందు మంచి రకం ధాన్యం పోసి, తరువాత నాసిరకం ధాన్యం పోశారనుకుందాం. మరల తీసుకునేటప్పుడు ముందు మంచి ధాన్యం వస్తాయి, తరువాత నాసిరకం ధాన్యం వస్తాయి. అలాగే గత జీవితంలో ముందు ధర్మకార్యాలు, దానాలు చేసి, తరువాత చెయ్యకుండా, అధర్మంగా ప్రవర్తిస్తే! ప్రారంభంలో ధనవంతులు అవుతారు, తరువాత సంపాదించినదంతా కోల్పోతారు, ఉన్న ఆర్థిక స్థితి కోల్పోతారు.


తెలుసుకోండి ఈ సృష్టి నియమాలు గుర్తించక, చేసే అధర్మ యుక్త పనులే ఆర్థిక ఇబ్బందులకు కారణం. అందుచేత ఉన్నదానితో తృప్తి చెందండి,

ఆశ పడకండి. ఆర్థిక స్థితి బాగుండాలని అనుకునేవారు, గతంలో చేసుకోకపోయినా, కనీసం ఇప్పుడైనా చేసుకోండి. దానాలు చేయండి, ధర్మకార్యాలు చేయండి. ఉన్నదాంట్లో కొంతైనా ఇవ్వండి. ఇవ్వబడిన దాంట్లో కొంత పంచండి. అన్యాయాలు, అక్రమాలు, మోసాలు చేయవద్దు, అధర్మంగా సంపాదించ వద్దు.

అందుచేత ఆర్థికస్థితి పెరగాలంటే ప్రత్యేకమైన కృషి అవసరం లేదు, అర్హత ఉంటే చాలు. అందుచేత ప్రస్తుతం లేకపోయినా, కనీసం భవిష్యత్తు కోసమైనా అర్హత సంపాదించండి, ఏది కావాలనుకుంటారో! అది ఇవ్వండి. ఎక్కువ కావాలనుకుంటే! మీకు వున్నదాంట్లో ఎక్కువ ఇవ్వండి, చాలు.

ముఖ్యంగా సృష్టి ధర్మాన్ని తెలుసుకొని ఏం చేయాలో అది చేయండి, వచ్చే దాని గురించి మర్చిపోండి. అందుకే శ్రీకృష్ణుల వారు నిష్కామగా కర్మ చెయ్యమంటారు. కారణం ఈ సృష్టిలో

"చేసిందానికి అడగకపోయినా అర్హతని బట్టి వచ్చే తీరుతుంది". సృష్టి నిర్ణయం ప్రకారం ఎప్పుడు రావాలలో అప్పుడు, ఎలా రావాలో అలా వస్తుంది.

బ్రహ్మర్షి పత్రీజీ ఆశీస్సులతో...
తటవర్తి వీరరాఘవరావు, శ్రీమతి రాజ్యలక్ష్మి దంపతులచే

**ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం**

*భీమవరంలో ప్రతీ నెలా 1, 2, 3 తేదీలలో పూర్తి రెసిడెన్షియల్ పద్ధతిన ఆత్మజ్ఞాన శిక్షణా శిబిరం నిర్వహించబడుతుంది. ఎన్ని రోజులు ధ్యానం చేసినా ధ్యానంలో పురోగతి సాధించలేనివారు, ఆలోచనలతో ఇబ్బంది పడేవారు ఈ శిబిరంలో పాల్గొంటే ఒకే సిట్టింగులో మూడు లేక నాలుగు గంటలు ధ్యానం చేయగల స్థితికి చేరుకుంటారు. పరిమిత సభ్యులకు మాత్రమే అవకాశం ఉన్నందున ముందుగా మీ పేర్లు నమోదు చేసుకోండి.*

*నిర్వహించు ప్రదేశం: శ్రీ వెంకటేశ్వరస్వామి వారి మందిరం, నరసింహపురం, ఉండి రోడ్, భీమవరం.*

*ప్రవేశం : మూడు రోజులకు భోజనం, వసతి ఉచితం*

వివరాలకు : ***తటవర్తి వీరరాఘవరావు,***
*తటవర్తి వారి వీధి, భీమవరం - 534 201.*
*సెల్ : 94403 09812, 94901 71853*

# 4.ఈ జన్మలోనే ఆర్థిక స్థితి పెంచుకోవాలంటే?

ప్రకృతిలో ఈ జన్మలో కూడా ఆర్థిక స్థితి పెంచుకునే అవకాశం వుంది. ఆ విషయాలు తెలుసుకుందాం.

చూడండి! బ్యాంకు నుంచి డబ్బు తీసుకోవాలంటే మూడురకాలుగా తీసుకోవచ్చు.

1. ముందుగా బ్యాంకులో వేసుకుని వుండాలి.
2. ఏవైనా ఆస్తులు తనఖా పెట్టాలి.
3. ఎవరైనా డబ్బు ఉన్నవారు హామీ ఉండాలి.

అలా ఈ మూడు రకాలుగా బ్యాంకునుండి డబ్బు పొందవచ్చు.

అలాగే ప్రకృతి నుంచి మీకు డబ్బు రావాలంటే!

1. చేసుకోవాలి
2. మీ భవిష్యత్తు తాకట్టు పెట్టాలి
3. ఎవరైనా సహాయం చెయ్యాలి.

**1. చేసుకోవాలి:-** బ్యాంకులో అయితే వేసుకోవాలి, ప్రకృతిలో అయితే చేసుకోవాలి అంటే పంచాలి. అంటే ధన దానాలు చేయాలి. అంతేకాదు లోక కళ్యాణ కరమైన పనులకు ధనం ఖర్చు చెయ్యాలి, మీకు ఉన్నంతలో ఇవ్వాలి. అందుకే శాస్త్రాలలో "పంచింది పెంచబడుతుంది" అని చెప్పబడింది.

ఒక ఉదాహరణ చూద్దాం. బ్యాంకు "ATM" మనందరికీ తెలుసు. చూడండి "ATM" ఉన్నచోట మేనేజర్ ఉండడు, క్లర్కు, క్యాషియర్ ఉండరు. ఎవరూ లేకపోయినా కూడా, 24 గంటలలో మీరు ఎప్పుడైనా సరే, డబ్బు తీసుకోవచ్చు. కాని డబ్బు రావాలంటే "ATM" లో కార్డు పెట్టాలి. ఊరికే కార్డు పెడితే వస్తుందా? రాదు. ఎందుకు అంటే? కార్డుకు అర్హత ఉండాలి. అర్హత అన్నది, అంతకు ముందు వేసుకుంటే వస్తుంది. ఎంత వేసుకుంటే, అంతే వస్తుంది. అంతేకానీ వెయ్యి రూపాయలు వేసి 3000 కావాలంటే వస్తుందా? రాదు కదా? ఎంత వేసుకుంటే అంతే వస్తుంది.

అలాగే ఈ సృష్టిలో కూడా చూడండి ఈ భూమండలం కూడా భగవంతుడు నిర్మించిన అతి పెద్ద "ATM". ఇప్పుడు మనం డబ్బులు తీసుకునే "ATM" మానవుడు నిర్మించిన బుల్లి "ATM" అవుతే, భూమి అన్నది, భగవంతుడు

నిర్మించిన అతిపెద్ద "ATM". బ్యాంకు "ATM" దగ్గర ఎవరు ఉండరు, అయినా డబ్బు పొందవచ్చు. అలాగే భూమి అనే "ATM" మీద కూడా ఎవరూ వుండరు. కాని ఎవరూ లేకపోయినా అంతకుముందు చేసుకుంటే వస్తుంది. ఎవ్వరు తీసుకొచ్చి మీకు ఇవ్వరు, మీరు చేసే కృషితో ఆటోమేటిక్ గా కలసివస్తుంది. అందుచేత అంతకుముందు చేసుకుని అర్హత సంపాదించుకుని ఉండాలి.

బ్యాంకులో చూడండి అంతకు ముందు ఎక్కువ వేసుకుంటే "ATM" నుండి ఎక్కువ తీసుకోవచ్చు. తక్కువ వేసుకుంటే తక్కువే వస్తుంది. అదే ప్రకృతిలో అయితే ఎక్కువ చేస్తే, ఎక్కువ వస్తుంది, తక్కువ చేస్తే తక్కువ వస్తుంది, ఏమి చేసుకోకపోతే, ఏమి రాదు. కాని ఇప్పుడు జనం ఏమీ చేసుకోకుండా, రావాలి అనుకుంటారు, కాని ప్రకృతిలో అది కుదరదు.

చూడండి చాలామంది తేలికగా పూజ చేసి, పూలు పెట్టి, హారతి ఇచ్చి, అగరబత్తి వెలిగించి, కొద్దిగా నైవేద్యం చూపెట్టి తినేస్తే వచ్చేస్తుంది అనుకుంటారు. అలా చేసి దేవుడా ఇవ్వు అంటే ఇవ్వడానికి ఎవరు ఉన్నారు? కావాలంటే "ATM" దగ్గరికి వెళ్లి, ఆ "ATM" కి పూజ చేయండి. అక్షింతలు వేసి, పసుపు, కుంకుమ వేసి, అగరుబత్తి వెలిగించి కోరుకోండి! ఓ "ATM" నేను చాలా కష్టాల్లో ఉన్నాను. ఒక 5000 ఇవ్వు అని అడిగితే, ఇస్తుందా? ఇవ్వదు కదా?

అలాగే పూజలు చేసి, కొబ్బరికాయలు కొట్టి, హారతి ఇచ్చినా ప్రకృతి నుంచి ఏమీ రాదు. అందుచేత జ్ఞానం ఉన్నవాడు చేసుకుంటాడు, జ్ఞానం లేని వాడు పూజలు చేసి ఆశతో ఎదురు చూస్తూ ఉంటాడు.

బ్యాంకు "ATM" డబ్బు మాత్రమే ఇస్తుంది. కాని భగవంతుని "ATM" ఏది ఇస్తే అది, ఎంత ఇస్తే అంత, ఎలాంటిది ఇస్తే అలాంటిది ఇస్తుంది. అంటే మంచి చేస్తే మంచి వస్తుంది, చెడు చేస్తే చెడు వస్తుంది. హింస చేస్తే హింస వస్తుంది. ఆనందం కలిగిస్తే ఆనందం వస్తుంది. అందరి మీద అసూయపడితే అందరూ నిన్ను అసూయపడతారు, నష్టపరిస్తే మీరు నష్టపోతారు. అలాగే ధనం ఇస్తే ధనం వస్తుంది.

ప్రకృతి యొక్క "ATM" లో నుంచి ఏది కావాలంటే అది తెచ్చుకోవచ్చు కానీ ఏది కావాలో అది చేసుకోవాలి. బ్యాంక్ "ATM" లో వేసుకోవాలి, ప్రకృతి "ATM" లో చేసుకోవాలి. ఏమీ చేయకుండా ఏమీ రాదు. కాని లోకంలో

దానాలు చేయటానికి ఇష్ట పడరు. కాని తీసుకోవటానికి మటుకు చాలా ఇష్టపడతారు. మరి కష్టమని చేసుకోకపోతే ఇష్టమైంది ఎలా వస్తుంది?

చాలామందికి ఈ డౌట్ ఉంటుంది ఏమోనండి, నేను ఇచ్చేస్తాను రాకపోతే నా బ్రతుకు ఏంటి? అంటారు. అలా ఇచ్చేటప్పుడు ఎంత ఆలోచిస్తారో? చూడండి ఏదైనా షాపులో ఖరీదు చేస్తే సరుకు ఇచ్చిన తర్వాత డబ్బులు ఇస్తారా? ముందే డబ్బులు ఇస్తారా? అంటే! షాపు వాడు సరుకు ఇస్తేనే గానీ మీరు డబ్బులు ఇవ్వరు. అలాగే ప్రకృతిలో కూడా ముందు ఇవ్వాలి... ఇస్తేనే వస్తుంది. వచ్చాక ఇస్తాను అంటే ప్రకృతిలో కుదరదు. అందుచేత ప్రకృతి నియమం తెలుసుకోండి. ఉన్న దాంట్లో కొంత ఇవ్వడానికి ప్రయత్నించండి.

అందుచేత సృష్టి నియమాలు తెలుసుకోండి. ఏది ఇస్తే అది, ఎంత ఇస్తే అంత, ఎలాంటిది ఇస్తే అలాంటిది వస్తుందని తెలుసుకోండి. ఈ సృష్టిలో ఇవ్వటం వరకే మీ వంతు, మీరు ఇచ్చిన దానికి తిరిగి ఎప్పుడు ఇవ్వాలో




అన్నది సృష్టి నియమాన్ని బట్టి వుంటుంది.

ఈ విషయం భగవద్గీతలో కూడా చెప్పబడింది.

**శ్లో॥ కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచనా**
**మా కర్మఫలహేతుర్భుర్మాతే సఙ్గో౽స్త్వకర్మణి.**
**(భ.గీ. 2 - 47)**

తా:- అర్జునా నీకు కర్మను చేయుట యందే అధికారము కలదు కానీ, కర్మఫలము ఆశించుట యందు నీకు అధికారం లేదు. కర్మఫలమునకు నీవు కారణ భూతుడవు కారాదు. మరియు కర్మలు మానుట యందు కూడా ఆసక్తి చూపించకూడదు.

అందుచేత ప్రకృతిలో నువ్వు చెయ్యాలనుకున్నది చెయ్యటమే నీ పని. నువ్వు చేసిన దానికి ఏది ఇవ్వాలో! ఎంత ఇవ్వాలో! ఎప్పుడు ఇవ్వాలో! ప్రకృతి నిర్ణయిస్తుందనే శ్రీ కృష్ణుల వారి సందేశం.

అంతేకాదు అన్నిటికంటే కర్మ ఫలత్యాగం గొప్పదని కూడా చెప్పబడింది.

**శ్లో॥ శ్రేయో హి జ్ఞానమ భ్యాసాత్ జ్ఞానాద్ధ్యానం విశిష్యతే**
**ధ్యానాత్కర్మఫలత్యాగస్త్యాగాచ్ఛాన్తిరనన్తరమ్ (భ.గీ. 12 - 12 )**

తా:- అభ్యాసము కంటే జ్ఞానము శ్రేష్టమైనది, జ్ఞానము కంటే ధ్యానం శ్రేష్ట

మగుచున్నది, ధ్యానము కంటే కర్మ ఫలమును విడుచుట శ్రేష్టమైయున్నది. అట్టి కర్మ ఫలత్యాగముచే శీఘ్రముగా శాంతి లభించుచున్నది.

అందుచేత ప్రకృతిలో ఏమీ ఆశించకుండా చెయ్యవలసింది చెయ్యండి, రావలసింది అదే వస్తుంది.

తెలుసుకోండి గతంలో మీరు చేసి ఉండలేదు అందుకే ప్రస్తుతం మీ ఆర్థికస్థితి బాగాలేదు. కానీ మీరు నిరాశ పడనక్కరలేదు, ఇప్పుడు చేసినా పొందే అవకాశం ఉంది. మీకు నిజంగా చెయ్యాలని ఉంటే యిప్పుడైనా చెయ్యండి, యిప్పుడైనా మీ ఆర్థిక స్థితి పెంచుకోవచ్చు, అవకాశం చేజారిపోలేదు.



ఇది నేను చెప్పడం కాదు, యోగ వాశిష్టంలో వశిష్టమహర్షుల వారు బోధించడం జరిగింది. ఆయన ఏమి అన్నారంటే?

**శ్లో॥ సర్వమే వేహ మిసదా సంసారే రఘునందన**
**సంమ్యక్ప్ర యుక్తాత్సర్వేం పౌరుషాత్సతువాప్యతే॥**
**(వశిష్టామృతం-1)**

తా:- సమస్త పదార్థాలు ఈప్రపంచంలో ఉత్తమ పురుష ప్రయత్నం అంటే, కృషిచేతనే లభిస్తాయి అని అన్నారు.

అంటే ఇప్పుడు మీకు ధనం కావాలి... మరి ధనదానం చెయ్యండి...చేస్తే వస్తుందనేగా వశిష్టులవారు చెప్పారు.

ఆయన ఇంకా ఏం చెప్పారంటే?

**శ్లో॥ యధా సంయతతే యేనతథాతేనానుభూయతే ।**
**స్వకర్మేవేతిచానేన్యా వ్యతిరిక్తానరనవృక్ ॥ (వశిష్టామృతం-13)**

**తా:-** "ఎవడు ఎలా చేసుకుంటాడో! వాడు దాని ఫలితాన్ని అలాగే అనుభవిస్తాడు."

అంటే ధనం ఇస్తే ధనం వస్తుందనేగా దాని అర్థం. అందుచేత ఉన్న దాంట్లో ఇవ్వండి,ఇస్తేనే కదా వచ్చేది? ఇవ్వకుండా దేవుడు నామీద దయ చూపించలేదు అని అంటే ఉపయోగం లేదు.

ఇప్పుడు మీ జీవితాలు ఎలా ఉన్నా, మీరు ఆందోళన పడనక్కరలేదు. ఇప్పుడు మీరు చేయాల్సింది చేయండి, మీ భవిష్యత్తు బాగా ఉంటుంది. ఏమీ చేయకపోతే భవిష్యత్తు మారదు. ఊరికే రమ్మంటే ఎలా వస్తుంది? పెద్దలు

చెప్పారు కదా? "చేసుకున్న వాడికి చేసుకున్నంత మహదేవ" అని. అందుచేత ఇస్తేనే పొందుతారని గ్రహించండి.

అంతేకాదు, సృష్టి సిద్ధాంతాలలో 'కర్మ సిద్ధాంతం' అనుసరించి ఈ న్మలో మీరు చేసుకున్న కర్మలలో 60 నుంచి 70 శాతం కర్మలు ఈ జన్మలోనే అనుభవించే అవకాశం వుందని తెలుసుకోండి. నిరాశపడకుండా ఉన్నంతలో ఇవ్వండి. భవిష్యత్తులో మీ ఆర్థిక స్థితి పెంచుకోండి.

**2.మీ భవిష్యత్తును తనఖా పెట్టాలి:-**

అలాగే డబ్బు సంపాదించాలంటే? బ్యాంకులో అవుతే ఏదైనా ఇల్లు, పొలము, బంగారము తాకట్టు పెట్టాలి. కానీ ప్రకృతిలో అవుతే మీ జీవిత భవిష్యత్తు తాకట్టు పెట్టాలి. అంటే తప్పులు, పాపాలు, మోసాలు, దొంగతనాలు, దోపిడీలు చేసి మీ భవిష్యత్తు, తాకట్టు పెట్టాలి. అలా భవిష్యత్తు తాకట్టు పెడితే ధనం వస్తుంది, కానీ భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు వస్తాయి, ఆర్థిక సమస్యలు వస్తాయి, వ్యాపారంలో నష్టాలు వస్తాయి. చూడండి చాలా మంది బిట్ కాయిన్స్ లో పోగొట్టుకున్నారు, కొంతమంది పందాలు కాసి, కొంతమంది లాటరీలలో లక్షలు, లక్షలు పోగొట్టుకున్నారు. అలా ఉన్న ఆస్తులు పోగొట్టుకున్న వారు ఎంతోమంది ఉన్నారు, అప్పులు పాలైనవారు కూడా చాలామంది ఉ న్నారు.

అంటే ఎప్పుడో తప్పు చేసారు, ఇప్పుడు పోయింది. ఇప్పుడు చేతిలో ఉన్న డబ్బు అయిపోయి, కష్టాలు పడుతున్నప్పుడు, అప్పులు తీర్చలేక భాధలు పడుతున్నప్పుడు తెలుసుకుంటారు తప్పులు, పాపాలు చేసి, భవిష్యత్తుని తాకట్టు పెట్టకూడదని.

**3.ఎవరైనా సహాయం ఇవ్వాలి :-**

బ్యాంకులో అయితే ఎవరైనా హామీ ఇవ్వాలి ప్రకృతిలో అయితే ఎవరైనా సహాయం చేయాలి.

చూడండి శ్రీకాంత్ కు ఒకావిడ కారు యిచ్చింది. ఆవిడ ఇవ్వకపోతే వాడు కొనలేడు అంటే మరొకరి ద్వారా సాయం అందింది.

అంతేకాదు వశిష్ఠుల వారు ఇంకా ఏమన్నారంటే?

**శ్లో॥ ప్రాక్తనం చైహికం చేతిద్వివిధం విద్ధి పౌరుషమ్**
**ప్రాక్తనోద్యతనేనాను పురుషార్థన జయతే (వశిష్ఠామృతం - 2)**

**"పూర్వజన్మలో చేసుకున్నవి, ఈ జన్మలో చేసుకున్నవి అని పురుష ప్రయత్నాలు రెండు రకాలుగా ఉంటాయి. అందులో పూర్వజన్మలో చేసుకున్నవి ఈ జన్మలో చేసుకునే పురుష ప్రయత్నం చేత శీఘ్రంగా జయింప బడతాయి"** అని చెప్పారు.

చూడండి పూర్వజన్మలో అధర్మంగా సంపాదించడం, మోసగించడం, ఎవరిదైనా అపహరించడం లాంటి పనులు చేయడం వలన ఈ జన్మలో ఆర్థికస్థితి సరిగ్గా లేకుండా జన్మించవలసి వచ్చింది. ఒకవేళ ధనం వున్నా ఆ ధనం కోల్పోయి ఆర్థిక సమస్యల్లో చిక్కుకోవలసి వస్తుంది. కారణం గతంలో అటువంటి కర్మలు చేసుకొని వుండడమే!

చూడండి వ్యాపారస్తులు ఎన్నో అధర్మ మార్గాల్లో సంపాదిస్తారు, ఉద్యోగస్తులు లంచాల ద్వారా ఎంతో సంపాదిస్తున్నారు, రాజకీయ నాయకులు ఇక చెప్పనక్కర్లేదు ఇలా ఎవరిని చూసినా అధర్మంగానే సంపాదిస్తున్నారు. కాని వీరందరిని పైన గమనించేవాడు ఉన్నాడు, ఆయన అందరిని, అన్నిటిని గమనిస్తున్నాడని మర్చిపోకండి. ఎంతసేపు మీ తెలివితేటలు ఉపయోగించి మోసాలు చేసినా, అన్యాయంగా, అక్రమంగా సంపాదించినా, దౌర్జన్యంగా అధికారాన్ని ఉపయోగించి సంపాదించినా, సంపాదించవచ్చు, కొన్నాళ్లు మురిసిపోవచ్చు కానీ ఆ వైభవం కొంతకాలమే వుంటుంది.

చూడండి దుర్యోధనుడు మాయాజూదంలో పాండవుల రాజ్యాన్ని హస్త గతం చేసుకున్నాడు. మాయాజూదం అంటే అధర్మమార్గంలో సంపాదించడం. తనది కాని పాండవుల సగం రాజ్యం సంపాదించాడు. కానీ ఎంతకాలం వుంది? ఒక 10- 12 ఏళ్లు ఉంది. తర్వాత యుద్ధం వచ్చింది ఏమైంది కౌరవులంతా నాశనం అయ్యారు, పాండవుల రాజ్యమే కాదు, దుర్యోధనుడు తన రాజ్యం కూడా కోల్పోయాడు. మొత్తం కుటుంబంలోని వారు నాశనం అయ్యారు. దుర్యోధనుడు అధర్మమైన పని అంటే సృష్టి విరుద్ధమైన పని చేసి వుండకపోతే తన సగ రాజ్యంతో భార్యా పిల్లలతో తానే కాదు, తన వారంతా ఎంతో హాయిగా జీవించేవారు. మరి ఇదంతా ఆశకు పోయి అధర్మంగా సంపాదించడానికి ప్రయత్నించడం వల్లనేగా జరిగింది? అందుచేత అధర్మ సంపాదన ఎంతోకాలం నిలవదని అర్థం చేసుకోండి.

కొంతమంది నాకు మంచి అధికారం ఉంది, మంచి పదవులలో

వున్నాను, ఏదైనా చేయవచ్చు, ఎన్ని లంచాలు అయినా తీసుకోవచ్చు, ఎన్ని కోట్లైనా అక్రమంగా సంపాదించవచ్చు అనుకుంటారు. సంపాదించి కొన్ని రోజులు మురిసిపోవచ్చు, కాని ఈ మురిపాలు ఎన్నాళ్ళో ఉండవు. అంతేకాదు దాని ఫలితంగా మరుజన్మలో పేదవాడిగా, ధనం తక్కువవాడిగా, బిక్షగాడిగా జన్మలు తీసుకొని నరకం అనుభవించవలసి వస్తుంది.

ఆర్థికస్థితి సరిగ్గాలేని వాళ్ళ పరిస్థితి ఇదే. ఒక్కొక్కరు ఒక్కొక్క రకమైన కర్మలు చేసి వచ్చారు. ఎంతోమందికి వారి గతం తెలియదు. అందుచేత నా పరిస్థితి ఇలా అయిపోయిందని బాధపడతారు.

పత్రీజీ ఎమంటారంటే? **"ఎవరి వాస్తవానికి వారే సృష్టికర్తలు"** అంటారు. అందుచేత మీ వాస్తవం ఇలా ఉండటానికి కారణం మీరే! అంటే మీరు గతంలో చేసుకున్నదే ప్రస్తుతం మీరు అనుభవిస్తున్నారు. అందుచేత మీరు ఏడ్చినా - బాధపడినా - ఎవరినో నిందించినా - ధనం ఉన్నవాడిని చూసి అసూయ పడినా మీ పరిస్థితిలో మార్పు రాదు.

మరి ఇలాంటి పరిస్థితులలో వున్న మీరు, మీ పరిస్థితి మారాలంటే ఏం చేయాలి? ఏం చేస్తే మీ ఆర్థిక స్థితిలో మార్పు వస్తుంది? అంటే సృష్టికి అనుగుణంగా ప్రయత్నించాలి. మరి సృష్టి నియమం ఏమిటంటే? ఇస్తే వస్తుంది, ఎది ఇస్తే అది వస్తుంది. అందుచేత ధనం కావాలంటే? ధనం ఇవ్వ వలసిందే? అందుచేత లోకకల్యాణ కరమైన పనులకు మీకు ఉన్నదాంట్లో కొంత ధనం ఖర్చు పెట్టండి, ధన దానం చెయ్యండి, ఇతరులకు సేవలు చెయ్యండి, మంచి కార్యక్రమాలకు డబ్బు ఖర్చు పెట్టండి .

మన సొసైటీలో ఎంతోమందికి మార్పు వచ్చింది. శ్రీకాంత్ కి రాలేదా? మధుకి రాలేదా? కూకట్‌పల్లి రమణ సేవలు చేశాడు ఇప్పుడు అతని స్థితి ఎంతో మారింది. అలా ఎంతోమందిలో వచ్చిన మార్పు ఈ జన్మలోనే నేను చూశాను.

అందుచేత ఉన్నంతలో లోకకల్యాణంకోసం కొంత కర్చు పెట్టండి, ఎవరిది ఆశించకండి. అలాగే చేయకూడనివి మానేయండి, చేయవలసింది చేయండి, రావలసింది అదే వస్తుంది, ఏ టైం లో రావాలో అప్పుడే వస్తుంది. కొంతమంది ఏమంటారంటే మా దగ్గర ఏమీ లేదు, ఎలా ఇవ్వగలం? ఎలా ధనం సంపాదించగలం? అంటారు.

అందుచేత ధనం పెంచుకోవాలంటే ధర్మంగా సంపాదిస్తూ, దానాలు చేస్తూ, ఉన్న దాంట్లో ఎంతో కొంత లోకానికి పంచుతూ, మంచి కార్యాలు చేస్తూ, ఆత్మ సేవలు చేస్తూ ఉంటే, భవిష్యత్తులో ఖచ్చితంగా మీ ఆర్థిక స్థితి పెరుగుతుంది, సందేహం లేదు.

చూడండి, ఎవరైనా బాగుపడితే అంటే ఆర్థికస్థితి పెరిగితే వాడు అదృష్టవంతుడురా! అంటారు. దెబ్బతింటే దురదృష్టవంతుడురా! అంటారు. అంతేకానీ వాడు అదృష్టవంతుడు ఎలా అయ్యాడో? ఆలోచించరు. దాని వెనకాల వాడి కృషి ఎంత వుందో తెలుసుకోలేరు. వాడు చేసిన ఆ కృషే, ఆ సకర్మే వాడు అలా వృద్ధి చెందడానికి కారణం. అలా ఎవ్వడు చేసుకున్నా వారి పరిస్థితి మారుతుంది.

సృష్టికి అంటే భగవంతునికి వాడు, వీడు అనే తేడా ఉండదు. ఆయన ఒకరిపట్ల ఎక్కువగాను, ఇంకొకరిపట్ల తక్కువగాను చేయడు. ఆయనకు అందరూ సమానమే. అందరూ ఒకటే కాబట్టి.

వశిష్ఠుల వారు ఏమన్నారంటే?

**శ్లో॥ ద్వౌహుడావివ యుద్ధ్యేతే పురుషార్థా సమాసమౌ**
**ప్రాక్తనశ్చైవ శామ్యత్యత్రాల్పవీర్యవాన్ (వశిష్ఠామృతం-5)**

తా:- పూర్వజన్మలోని పురుష ప్రయత్నాలు అంటే పాప కర్మలనుకోండి, అధర్మ కార్యాలనుకోండి వాటిని ఒక పొటేలుగా... అలాగే ఈ జన్మలో చేసే పురుష ప్రయత్నాలు అంటే ధర్మంగా జీవించడం, దానాలు ఇవ్వటం, మంచి మంచి సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం, వాటికి డబ్బులు ఖర్చు పెట్టడం లాంటివన్నీ మరొక పొటేలుగా పేర్కొన్నారు.

ఈ రెండు పొటేళ్లు యుద్ధం చేసుకున్నప్పుడు, అందులో బలహీనమైనది ఓడిపోతుందని అన్నారు.

అంటే ఇంతకు ముందు జన్మలో మీరు చేసిన మోసాలు, అధర్మకార్యాలు, లాంటివన్నీ బాగా ఎక్కువ ఉన్నాయనుకోండి... అంటే అధర్మ కార్యాల పోటేలు బలంగా వున్నట్టు. కాని ఇప్పుడు చేసే దానాలు, సేవలు తక్కువగా ఉంటే మీ ధర్మకార్యాలు పోటేలు బలహీనంగా ఉన్నట్టు. అప్పుడు ఏమవుతుంది? బలహీనంగా వున్నది ఓడిపోతుంది. అంటే మీ ఆర్థికస్థితి కొద్దిగా కూడా పెరగదు. మీరు ఏమంటారంటే? నేను దానికి ఇచ్చానండి, దీనికి ఇచ్చానండి అంటారు.

కానీ దేనికి ఇచ్చినా నువ్వు ఇచ్చినవి బలహీనమైనవి, అందుకే ధనం పెరగలేదు.

అందుచేత చేసే ధర్మ కార్యాలు అలా కొనసాగిస్తూనే ఉండాలి, ఎంత వీలైతే అంత చేస్తూనే ఉండాలి, అన్ని రకాలుగా చేస్తూ ఉండాలి. అలా ఇస్తూ ఉంటే ఇచ్చే పొట్టేలు  బలంగా తయారవుతుంది. ఎప్పుడైతే  బలంగా తయారైందో!  ఆ అధర్మ కార్యాలు అనే  పోటేలు ఓడిపోతుంది. అప్పుడు మీకు ఆశ్చర్యం గొలిపే విధంగా అన్నీ కలిసి వస్తూ ఉంటాయి. మీరు చేసే వ్యాపారం కాని ఏదైనా కలిసొస్తుంది.  అనుకోకుండా మీ ఆర్థిక స్థితి కూడా మారిపోతుంది.

ఆయన ఇంకా ఏమన్నారంటే?

**శ్లో॥ దోషః శామ్యత్యసందేహం ప్రాక్తనోద్యతనైర్గుణైః**
**దృష్టాన్తోత్ర హ్యస్తనస్య దోష స్యాధ్యగుణైః క్షయః (వశిష్ఠామృతం - 8)**

తా:-గత దినపు అజీర్ణాదిరోగాలు, ఈ దినపు ఔషధం చేత శమించినట్టు అంటే తగ్గినట్టు తప్పనిసరిగా గత జన్మ పురుష ప్రయత్నం అంటే పాపకర్మలు, అధర్మ కార్యాలు ఇవన్నీ... ఈ జన్మపు పురుష ప్రయత్నం అంటే దానాలు, సేవలతో నిస్సందేహంగా శమించిపోతాయన్నారు. ఏదో గత జన్మల్లో ఆశతోనో, తెలియకో, ఈ మోసాలు, అక్రమ సంపాదన, అన్యాయమైన సంపాదన చేశారు. కాని ఇప్పుడు చేసే సేవలతో శమించిపోతాయి.

తెలుసుకోండి సంపాదించడం గొప్ప కాదు, సేవ చేయటం గొప్ప. సేవే సంపాదన. ధనం సంపాదిస్తే కనిపిస్తుంది , సేవ అన్నది కనిపించదు. నువ్వు ధనం సంపాదించావు అనుకో, అది ఇంతకుముందు పుణ్యకర్మ చేయబట్టే సంపాదిచావు. కాని అనుభవిస్తే చేసిన పుణ్య కర్మ ఖర్చయిపోతుంది. తర్వాత ధన సంపాదన ఆగిపోతుంది. నా బతుకు ఇలా అయిపోయింది అని మళ్ళా ఏడుస్తారు. అందుచేత ప్రస్తుతం ఎంతసంపాదిస్తున్నా, అదే రకమైన సంపాదన జీవితమంతా ఉండదని తెలుసుకోండి. అందుచేత గతంలోలాగే ప్రస్తుతం కూడా సేవలు, దానాలు చేస్తూనే  ఉండాలి.

చూడండి బ్యాంకులో డబ్బు వేసుకుని రోజూ తీసుకుంటున్నారు.  కానీ అలా లైఫ్ లాంగ్ తీసుకోగలరా? ఎన్నాళ్ళు తీసుకుంటారు?ఆ బ్యాలెన్స్ ఉన్నంతసేపు తీసుకుంటారు. బాలన్స్ అయిపోతే తీసుకోలేరు కదా? అందుచేత ఎప్పుడూ అలా తీసుకోవాలంటే, వేస్తూనే ఉండాలి.

చాలామంది వాడు పెట్టిపుట్టాడు అనుకుంటారు. కాని ఎంత చేస్తే అంతకే పుడతాడు . ఏ రోజు స్టాక్ అయిపోతుందో అప్పుడు మళ్లీ రావు, వచ్చినవి కూడా పోతాయి.

అందుకే షిరిడి బాబా ఏమన్నారంటే? నీకు ఇవ్వబడిన దాన్ని త్యాగభావంతో అనుభవించు అన్నారు. అంటే ఇవ్వబడినదానిని అవసరాలకు ఉపయోగించు కుంటూ, కొంత త్యాగం చేయాలి అంటే సేవలకి, లోకకల్యాణానికి ఉప యోగించాలి అన్నారు.

మీకు ఉన్నదంతా ఇవ్వక్కర్లేదు, అప్పుచేయక్కర్లేదు ఉన్నదాంట్లో ఎంత ఇవ్వగలిగితే అంత ఇవ్వండి. లేకపోతే సమయాన్ని ఇవ్వండి, వాక్కు ఇవ్వండి, శక్తినివ్వండి ఏదైనా ఇస్తూ ఉండండి.

అంతే కానీ మీరు మనీ మెడిటేషన్ చేసినా! కర్మ విపాక ధ్యానాలు చేసినా ఏమీ ప్రయోజనం లేదు. అవి మీకు తృప్తిని ఇస్తాయి కానీ ఫలితం ఇవ్వలేవు.

అలా వశిష్టుల వారు చెప్పినట్టు ప్రస్తుతం మనం చేసే ప్రయత్నం అలా కొనసాగిస్తూ ఉంటే ఖచ్చితంగా గతంలో ఏమున్నా సరే, అవన్నీ తొలగిపోతాయి. మన జీవితం మారిపోతుంది సందేహం లేదు.

అందుచేత మీ జీవితం గురించి వర్రీ పడకండి. చేయడం మీద దృష్టి పెట్టండి . అన్నీ దానంతటవే సర్దుకుంటాయి. ఫలితం ప్రకృతికి వదిలేయండి. మీరు చేసేది ప్రతిదీ రికార్డు అవుతుంది. సమయం వచ్చినప్పుడు మీరు చేసినదానికి ప్రతిఫలం తప్పక వచ్చితీరుతుంది. మీ ఆర్థిక సమస్యలు తీరిపోతాయి, ఆర్థిక స్థితి పెరుగుతుంది.

ఒక్క విషయం గుర్తుంచుకోండి, **"మీ జీవితంలో ఏది జరిగినా శాశ్వతం కాదని తెలుసుకోండి".**

ముఖ్యంగా 'శ్వాస మీద ధ్యాస' ఉంచి తీవ్రంగా ధ్యానం చేయండి. మీ బుద్ధి వికసించి అడగకుండానే ఇస్తూ ఉంటారు. మీ జీవితాన్ని మీరే మార్చుకుంటారు.

# అత్యంత ధనవంతులు కావాలంటే?

ఈ ప్రపంచంలో ఎవరిని చూసినా, ఎవరికివారు కోట్లు సంపాదించాలని చూస్తున్నారు. అలా ఎన్ని కోట్లు సంపాదించినా, ఇంకా ఇంకా అంటూనే ఉన్నారు. కారణం ఎంత ఎక్కువ సంపాదిస్తే అంత గొప్పవారు అయినట్టుగా భావించడం వల్ల. ఏదో కొద్దిగా సంపాదించి ఊరుకోవడం లేదు, అలా సంపాదిస్తూ, సంపాదించిన దానిని చూసి మురిసిపోతున్నారు. అలాగే సంపాదించ లేనివారు దురదృష్టం వంతుల మని భావిస్తున్నారు. అంతేకాదు సంపాదించడం కోసం తప్పులు, పాపాలు కూడా చేస్తూన్నారు. కాని గమనిస్తే, ఎవరు ఎంత సంపాదించినా, ఇంకా సంపాదించ వలసింది ఉంటూనే ఉంటుంది. కారణం ఒకరికంటే ధనవంతులు ఇంకొకరు ఎప్పుడూ ఉంటారు.

ఇది ప్రస్తుత ప్రపంచ స్థితి. ఎవరు ఇంతకన్నా ఆలోచించడం లేదు. ఒకరకంగా చూస్తే అందరూ అందరికంటే ధనవంతులు కావాలని ఆరాటపడుతూ వుంటారు. అందుకే జీవితమంతా కష్టపడుతున్నారు. కానీ గమనిస్తే ఎవరిని చూసినా, వారి కోరిక తీరకుండానే ఎప్పుడో ఒకప్పుడు జీవితాన్ని చాలించవలసి వస్తుంది. కానీ ఎవరైనా సరే ఈ జీవితంలోనే అందరికంటే ధనవంతులు కావాలనుకుంటే మాత్రం మార్గం కూడా ఉంది. అదేమిటో తెలుసుకుందాం.

ముందు ఈ విషయం ఆలోచించండి? కోట్లు సంపాదించాలా, కోటీశ్వరునకు లైన్ వెయ్యాలా? అంటే తెలివైన అమ్మాయి కోటీశ్వరుడికి లైను వేయాలనే చెబుతుంది. ఎందుచేతనంటే ఎన్ని సంవత్సరాలు కష్టపడినా, జీవితాంతం కష్టపడినా కోట్లు సంపాదించడం చాలా కష్టం. ఒక్కొక్కసారి సంపాదించ లేకపోవచ్చు కూడా. కానీ తెలివిగా కోటీశ్వరుడికి లైన్ వేసి, వాడిని పెళ్లి చేసుకుంటే, కోట్లు అన్ని ఆమె వేగా?

అందుచేత అలా కోట్లు సంపాదించి, కోటీశ్వరుడు కావడానికి, జీవితమంతా పాటుపడే బదులు, ఈ సృష్టిలో అందరికంటే కోటీశ్వరుడికి లైన్ వేస్తే, అంటే ప్రయత్నించి వారిని పొందితే, వారి కంటే అదృష్టవంతులు ఉండరు కదా? మరి ఈ సృష్టిలో అందరికంటే గొప్ప కోటీశ్వరుడు ఎవరు? అంటే ఈ సృష్టిలోనే అందరికంటే గొప్పవాడు, కోటీశ్వరుడు ఒక్కడే ఒక్కడు. ఆయనే భగవంతుడు. ఆయన కంటే గొప్ప వాడు ఈ సృష్టిలో లేనే లేడు. కారణం ఈ సృష్టే ఆయనది, ఈ సృష్టిలోని కోటాను కోట్ల లోకాలన్నీ ఆయనవే, కోటను కోట్ల లోకాలలోని సంపదలన్నీ కూడా ఆయనవే.

ఆఖరికి ఈ భూమండలం కూడా ఆయనదే! ఈ భూమండలంలోని

సంపదలు అన్ని ఆయనవే! ఈ విషయం తెలియక మానవులు, ఈ భూమండలం లోని కొద్దిపాటి అత్యల్ప మైన ప్రాంతం సంపాదించుకొని, నేనే గొప్ప వాడినని భావిస్తున్నారు, అహంకరిస్తున్నారు, గర్విస్తున్నారు, మురిసి పోతున్నారు. చివరకు అన్ని వదిలి వెళ్ళిపోతున్నారు, మరల కనిపించడం లేదు.

కానీ భూమి మీద ఉన్న కోటీశ్వరులు, రాజులు, చక్రవర్తులు, కుబేరులు అందరి కంటే భగవంతుడే గొప్ప ధనవంతుడు. అందుచేత తెలివైన వారు, అలా జీవితమంతా కష్టపడి ఏవో కొన్ని కోట్లు సంపాదించడానికి ప్రయత్నించరు, జీవితాన్ని వృధా చేసుకోరు. వారు తమ జీవితాన్ని, అత్యంత గొప్ప కోటీశ్వరుడైన భగవంతుని పొందటానికి ప్రయత్నిస్తారు. భగవంతునికి లైను వేస్తారు, చివరకు భగవంతుని పొందుతారు. అలా భగవంతుని పొందినవారే అదృష్టవంతులు. వారిని మించినవాడు ఈ భూలోకంలో ఎవరు ఉండరు. కారణం భగవంతుని పొందినవారు, సమస్తము పొందినట్టే కదా? అటువంటి వాడు అత్యంత ధనవంతుడే కదా?

మరి భగవంతుని పొందాలంటే ఏం చేయాలి? భగవంతునికి ఎలా లైను వేయాలి? అంటే ముందు భగవంతుడు ఎవరు తెలుసుకోవాలి? ఆయన ఎక్కడ ఉంటాడో తెలుసుకోవాలి? ఆయనను ఎలా పొందాలో తెలుసుకోవాలి?

తెలుసుకోండి భగవంతుడు ఎవరో కాదు ఆత్మ. ఈ విషయమే భగవద్గీతలో, 10వ అధ్యాయం 20వ శ్లోకంలో శ్రీకృష్ణులవారే చెప్పడం జరిగింది. మరి ఆత్మ భగవంతుడు అయినప్పుడు, ఆయన ఎక్కడ ఉంటాడు? అంటే ఆయన అందరిలో ఉంటాడని కూడా చెప్పడం జరిగింది. అందుచేత అందరిలో ఉన్న భగవంతుడు తన శరీరంలోనూ ఉంటాడని తెలుసుకోవాలి.

మరి శరీరంలో ఉన్న భగవంతుని చేరాలన్నా, పొందాలన్నా ఏకైక మార్గం ధ్యానం. ఎవరైతే ధ్యానం చేస్తారో! వారు భగవంతుని పొందుతారు, అన్ని పొందినవారు అవుతారు. వారి కంటే ధనవంతులు, అదృష్టవంతులు ఎవరూ వుండరు. ఎందుచేతనంటే? వారు బ్రహ్మానందాన్ని పొందుతారు, సమస్త దుఃఖాల నుంచి శాశ్వతంగా బయట పడతారు. అందుచేత కోట్లు వెనకాల పడకండి, ధ్యానం వెనకాల పడండి. భగవంతుని పొందండి, అత్యంత ధనవంతులు కండి, అదృష్టవంతులు కండి.

అందుకే పరమయోగి కబీర్ ఏమన్నారంటే? " ఏ ధనం అయితే నీ జన్మ జన్మాంతరాలకు వస్తుందో... అటువంటి ధనాన్ని సంపాదించు. ఎంతో కష్టపడి సంపాదించిన భౌతిక ధనాన్ని, ఎవరు నెత్తి మీద పెట్టుకొని, మరణించేటప్పుడు వెళ్లడం నేను చూడలేదు." అన్నారు.

# తటవర్తి వీరరాఘవరావు గారి రచనలు

| | | |
|---|---|---|
| 1) జీవితశాస్త్రం (మొదటి భాగం) | - | రూ.130/- |
| 2) జీవితశాస్త్రం (రెండవ భాగం) | - | రూ.130/- |
| 3) జీవిత సత్యాలు | - | రూ.130/- |
| 4) భగవంతుడంటే | - | రూ.130/- |
| 5) సత్యమార్గం | - | రూ.160/- |
| 6) ఆత్మ శాస్త్రం | - | రూ.130/- |
| 7) ధ్యాన శాస్త్రం | - | రూ.130/- |
| 8) భగవద్గీతా సారం - శ్రీ కృష్ణ సందేశం | - | రూ.160/- |
| 9) ధ్యాన శక్తి | - | రూ.130/- |
| 10) తెలుసుకోండి | - | రూ.130/- |
| 11) జీవిత సూక్ష్మాలు | - | రూ.130/- |
| 12) మరణించకముందే మరణించాలి | - | రూ.130/- |
| 13) మరోజన్మ (తటవర్తి రాజ్యలక్ష్మి) | - | రూ.160/- |
| 14) "గైడింగ్" ధ్యానం ఎందుకు కాదు? | - | రూ.120/- |
| 15) గీతాసందేశం | - | రూ.100/- |
| 16) కర్మ సిద్ధాంతం | - | రూ.80/- |
| 17) ధ్యానమంటే ? | - | రూ.80/- |
| 18) ఆత్మజ్ఞానం ఎందుకు? | - | రూ.70/- |
| 19) జ్ఞాన జ్యోతి | - | రూ.70/- |
| 220) జ్ఞాన కుసుమాలు | - | రూ.70/- |
| 21) దుఃఖ నివారణామార్గం | - | రూ.60/- |
| 22) బ్రహ్మజ్ఞానం | - | రూ.60/- |
| 23) త్రివిధాలు | - | రూ.60/- |
| 24) ధ్యానం (పత్రీజీ) | - | రూ.60/- |
| 25) ధ్యానం వల్లనే జ్ఞానం | - | రూ.60/- |
| 26) అతీంద్రియ శక్తులు | - | రూ.60/- |
| 27) శాస్త్రాల అర్థం- అంతరార్థం | - | రూ.60/- |
| 28) విద్యార్థుల వికాసానికి ధ్యాన విద్య | - | రూ.60/- |
| 29) భూతదయే దైవత్వం | - | రూ.60/- |
| 30) ఆలోచించండి | - | రూ.60/- |
| 31) షిరిడీ సాయి సందేశాలు | - | రూ.60/- |
| 32) సంకల్పమంటే? | - | రూ.50/- |
| 33) ఈ జీవితం ఎందుకు? | - | రూ.50/- |
| 34) ఆశ్చర్యం... ఆశ్చర్యం | - | రూ.50/- |
| 35) నిర్వాణ మార్గం | - | రూ.50/- |
| 36) ఆర్థిక పరిస్థితి పెంచుకోవాలంటే | - | రూ.50/- |
| 37) సత్యం | - | రూ.40/- |
| 38) చక్రాలు | - | రూ.40/- |
| 39) భాగవత సన్నివేశాల అంతరార్థం | - | రూ.40/- |
| 40) మౌన ధ్యానం | - | రూ.40/- |
| 41)మనం ఇహలోకవాసులమా? పరలోకవాసులమా? | - | రూ.20/- |
| 42) శాకాహారమే మానవాహారం | - | రూ.15/- |
| 43) అహింస మరియు శాఖాహారం | - | రూ.15/- |


పుస్తకముల కొరకు :

**తటవర్తి వీర రాఘవరావు,**

తటవర్తివారి వీధి, భీమవరం-1. ప॥గో॥జిల్లా. ఆం.ప్ర.

సెల్ : 9440309812, 9490171853



లోకంలో డబ్బు లేదని బాధపడేవారు,

డబ్బు సంపాదించాలని ప్రయత్నం చేసేవారు,

సంపాదించలేక పోయానని బాధపడే వారు,

డబ్బు ఉన్నవాళ్లను చూసి అసూయపడేవారు

ఇలా రకరకాలుగా ఉన్నారు.

ఏమీ చేయలేక నిరాశగా ఉన్నవారు ఉన్నారు,

దేవుణ్ణి నిందించేవారు కూడా ఉన్నారు.

అందుచేత ఆర్థిక విషయాల మీద

అవగాహన చేసుకుందాం.

– తటవర్తి వీరరాఘవరావు

రూ.50/-